RNI No. APTEL/2009/28868

# సిటిజన్ టైమ్స్


ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

తెలుగు దినపత్రిక

CITIZEN TIMES TELUGU DAILY

VOLUME: 17 | ISSUE: 249 | EDITOR: KANCHERLA SANDEEP KUMAR | VISAKHAPATNAM 4-4-2026 | Pages: 8 | Rs: 2/-

సంపుటి : 17 | సంచిక :249 | 4-4-2026 | పేజీలు : 8 | రూ: 2/-



# ఒక్క వైసీపీ తప్ప అమరావతికి దేశమంతా మద్దతు ఇచ్చింది

పార్లమెంట్‌లో ప్రజా విజయం

ఒక్క వైసీపీ తప్ప.. దేశమంతా ఏకతాటిపై

అమరావతి ఆవిర్భావం..


అప్పటి పరిస్థితులువిధ్వంసం సృష్టించి..

భవిష్యత్తును దెబ్బతీశారు

తిరిగి పట్టాలెక్కిన పనులు..

భవిష్యత్ ప్రణాళిక ఇదే

ఇక శాశ్వతం.. ఎవరు ఆపలేరు



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతికి పార్లమెంట్ ఉభయ సభల్లో చట్టబద్ధత లభించడం చరిత్రాత్మకమని, ఇది ఐదు కోట్ల ఆంధ్రుల విజయమని ముఖ్యమంత్రి చంద్రబాబు అభివర్ణించారు. ఈ సందర్భంగా ఉండవల్లిలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, రాష్ట్ర విభజన నుంచి నేటి వరకు జరిగిన పరిణామాలను వివరించారు. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. 2024 జూన్ 2 నుంచి అమరావతి శాశ్వత రాజధానిగా ఉంటుందని, రాష్ట్రపతి ఆమోదంతో ఇది చట్టంగా మారి అమల్లోకి వస్తుందని స్పష్టం చేశారు.

**పార్లమెంట్‌లో ప్రజా విజయం**

అమరావతికి రాజధానిగా చట్టబద్ధత కల్పించే ప్రక్రియలో పార్లమెంట్‌లో దాదాపు అన్ని పార్టీలు ఏకగ్రీవంగా మద్దతు తెలిపాయని చంద్రబాబు వివరించారు. కొన్ని పార్టీలు నేరుగా మద్దతు పలకగా, మిగిలినవి కూడా సహకరించాయని తెలిపారు. ఇది ప్రజా రాజధానికి దక్కిన గౌరవమన్నారు. ఈ చారిత్రాత్మక నిర్ణయానికి సహకరించిన ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్మన్‌తో పాటు మద్దతిచ్చిన అన్ని రాజకీయ పార్టీలకు, ఎంపీలకు ఐదు కోట్ల ప్రజల తరఫున మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు.

**ఒక్క వైసీపీ తప్ప.. దేశమంతా ఏకతాటిపై**

దేశంలోని అన్ని పార్టీలు తమ రాజకీయ విభేదాలను పక్కనపెట్టి ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాల కోసం, దేశ ప్రయోజనాల కోసం అమరావతికి మద్దతుగా నిలిచాయని చంద్రబాబు అన్నారు. కానీ, ఈ రాష్ట్రంలో ఓట్లు వేయించుకుని గెలిచిన వైసీపీ మాత్రం రాష్ట్రానికి ద్రోహం చేసిందని తీవ్రంగా విమర్శించారు. "దేశమంతా ఒక దారి అయితే, వీళ్లది ఇంకో దారి అయ్యే పరిస్థితి

తరువాయి 2లో..

## 2047 నాటికి తెలంగాణను టెక్స్‌టైల్ రాజధానిగా మారుస్తాం

*సీఎం రేవంత్ రెడ్డి*



**హైదరాబాద్, సిటిజన్ టైమ్స్**

2047 నాటికి తెలంగాణను దక్షిణ ఆసియాకు టెక్స్‌టైల్ రాజధానిగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో జరిగిన ఏషియన్

తరువాయి 2లో..

## హైదరాబాద్‌లో పుట్టి పెరిగా..

## ఆ రోజు మెడపట్టి గెంటివేశారన్న బాధ ఉంది

మూడు ముక్కలాటపై అలుపెరుగని పోరాటం

రైతులను వెంటాడి వేధించారు

యావత్ భారతదేశం అండగా నిలబడింది

**అమరావతి, సిటిజన్ టైమ్స్**

"ఈరోజు చరిత్రలో నిలబడే రోజు. 5 కోట్ల ఆంధ్రులు గెలిచిన రోజు. అమరావతి రైతులు గెలిచిన రోజు. అమరావతి మహిళలు గెలిచిన రోజు" అని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. ఢిల్లీలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఆంధ్రులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తొలుత మనందరం మద్రాసు రాజధానిగా మద్రాసు స్టేట్ లో ఉన్నామని, దాని తర్వాత పొట్టి శ్రీరాములు చేసిన 58 రోజుల దీక్ష, ప్రాణత్యాగం వల్ల భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడ్డాయని గుర్తు చేశారు. అందులో భాగంగా కర్నూలు రాజధానిగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది. మూడేళ్ల తర్వాత ఒక ఒప్పందం వల్ల మళ్లీ తెలంగాణా, ఆంధ్ర కలిపి హైదరాబాద్ రాజధానిగా రాష్ట్రం ఏర్పాటైందని అన్నారు. 58 సంవత్సరాలు కష్టపడి, చెమటోడ్చి అటు తెలంగాణా, ఇటు ఆంధ్రప్రజలు కలసికట్టుగా హైదరాబాద్ ను అభివృద్ధి చేసుకున్నామని, ఒక చీకటిరోజు



పార్లమెంటులో ఎలాంటి చర్చ జరగకుండా టీవీలు కట్టేసి, తలుపులు మూసేసి ఆంధ్రరాష్ట్రాన్ని అడ్డగోలుగా విభజించారని విమర్శించారు.

**మెడపట్టి బయటకు గెంటేశారన్న బాధ ఉంది**

ఆనాడు చంద్రబాబునాయుడు ప్రతిపక్షనేతగా

తరువాయి 2లో..

## అప్పుడు వారు నాలుగు పెళ్లిళ్లు చేసుకోలేరు


*సివిల్‌కోడ్‌పై అమిత్‌షా*



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

అస్సాం అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాజపా అగ్ర నేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాల్గొన్నారు. గోల్‌పాడా జిల్లాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో కీలక వ్యాఖ్యలు చేశారు. చొరబాటుదారులు నాలుగు పెళ్లిళ్లు చేసుకోకుండా ఉమ్మడి పౌరస్మృతి

తరువాయి 2లో..




### 'లితానీ' ప్రణాళికపై ఇజ్రాయెల్ దృష్టి

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

గాజాలో 55 శాతం భూభాగాన్ని అధీనంలోకి తీసుకున్న ఇజ్రాయెల్, ఇప్పుడు దక్షిణ లెబనాన్‌పై గురిపెట్టిందా..? గాజా తరహాలో లెబనాన్‌లోనూ 'బఫర్ జోన్'ను సృష్టించనుందా! అంటే అవుననే సమాధానాలు వస్తున్నాయి. ఇజ్రాయెల్ ఉత్తర సరిహద్దు నుంచి దక్షిణ లెబనాన్‌లోని లితానీ నది మధ్య భూభాగాన్ని పూర్తిగా నియంత్రణలోకి తెచ్చుకొనేందుకు ఇజ్రాయెల్ పావులు కదుపుతోందని లెబనాన్ ఆరోపిస్తోంది. అందరి దృష్టి ఇరాన్ యుద్ధంపై

తరువాయి 2లో..

## భారత రాజ్యాంగం ఆర్టికల్ 14

### చట్టం ముందు అందరూ సమానం... వివక్షతకు తావులేదు!




భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించే గొప్ప పత్రం. అందులో ముఖ్యమైన హక్కులలో ఒకటి ఆర్టికల్ 14, అంటే చట్టం ముందు సమానత్వం. ఈ ఆర్టికల్ ప్రకారం, భారతదేశంలో నివసించే ప్రతి వ్యక్తిని చట్టం సమానంగా చూడాలి. ప్రభుత్వం ఎవరిపైనా వివక్ష చూపకూడదు. ఆర్టికల్ 14 యొక్క ప్రధాన ఉద్దేశ్యం సమాజంలో న్యాయం మరియు సమానత్వాన్ని స్థాపించడం. కులం, జాతి, మతం, లింగం, జన్మస్థలం వంటి కారణాల ఆధారంగా ఎవరికీ అన్యాయం జరగకుండా ఇది రక్షణ కల్పిస్తుంది. ఇది భారత ప్రజాస్వామ్యానికి ఒక బలమైన స్థంభం.

**ఈ ఆర్టికల్ రెండు ముఖ్య భాగాలుగా విభజించబడింది.**

మొదటిది చట్టం ముందు సమానత్వం దీని అర్థం ప్రతి వ్యక్తి చట్టం ముందు ఒకే స్థాయిలో ఉంటాడు. ఎవరైనా ఉన్నత స్థాయి వ్యక్తి అయినా, సాధారణ పౌరుడైనా చట్టం ముందు అందరూ సమానమే. ఎవరికీ ప్రత్యేక హక్కులు ఉండవు. ఇది ప్రతికూల భావనగా పరిగణించబడుతుంది, ఎందుకంటే ఇది ప్రత్యేక ప్రాధాన్యాన్ని నిరాకరిస్తుంది. రెండవది చట్టాల సమాన రక్షణ అంటే ఒకే పరిస్థితిలో ఉన్న ప్రతి వ్యక్తికి ఒకే విధమైన చట్టాలు వర్తించాలి. ప్రభుత్వం ప్రజలందరికీ సమాన రక్షణ కల్పించాలి. ఇది సానుకూల భావనగా పరిగణించబడుతుంది, ఎందుకంటే ఇది సమాన న్యాయం అందించడానికి ప్రభుత్వాన్ని బాధ్యత వహింపజేస్తుంది.

**ఆర్టికల్ 14 ఉల్లంఘన చర్యలు**

ఆర్టికల్ 14 ఉల్లంఘన జరిగితే, బాధితుడు న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చు. కోర్టు ఆ కేసును పరిశీలించి, నిందితుడిని దోషిగా తేల్చిన పక్షంలో జైలు శిక్ష లేదా జరిమానా విధించవచ్చు. కొన్ని సందర్భాల్లో బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని కూడా ఆదేశించవచ్చు. ఈ విధంగా, ఆర్టికల్ 14 ప్రజల హక్కులను కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తుంది. మొత్తం మీద, ఆర్టికల్ 14 సమాజంలో సమానత్వాన్ని, న్యాయాన్ని స్థాపించే ఒక శక్తివంతమైన ఆయుధం. ఇది వివక్షను పూర్తిగా తిరస్కరిస్తూ ప్రతి వ్యక్తికి సమాన గౌరవాన్ని కల్పిస్తుంది. భారతదేశంలో ప్రజాస్వామ్యం బలంగా నిలబడటానికి ఈ ఆర్టికల్ ఎంతో కీలకం.



జె. కనక దుర్గా లక్ష్మీ
ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ (IHR)
ఉత్తరాంధ్ర ఇంచారి

## పౌరులే దేవుళ్లు

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

తమ ప్రభుత్వం 'పౌరులే దేవుళ్లు' (నాగరిక్ దేవో భవ) అనే ప్రధానమైన పాలనా మంత్రంతో పని చేస్తోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా భారత్ దూసుకెళ్తోందని, ఈ



తరుణంలో ప్రజలకు అందించే సేవలను ఎప్పటికప్పుడు ఆధునికీకరించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ లక్ష్యంతోనే పౌరులే కేంద్రంగా ప్రజా సర్వీసులను తమ సర్కారు విస్తరిస్తోందన్నారు. గురువారం ఢిల్లీలో 'కర్మయోగి సాధనా

తరువాయి 2లో..

## ఎడిటోరియల్

### బాబు ఆశావాది...

### జగన్‌కి తెలియనిది అదే !

ఏపీ రాజకీయాల్లో గత పదిహేనేళ్ళుగా చంద్రబాబు జగన్ ల మధ్య రాజకీయ వైరం పెద్ద ఎత్తున సాగుతోంది. నిజం చెప్పాలంటే చంద్రబాబు వైఎస్సార్ సమకాలీనుడు. కానీ వైఎస్సార్ బాబు ఇద్దరూ ముఖా ముఖీ తలపడింది. అతి కొద్ది సంవత్సరాలే కావడం విశేషం. 1998లో వైఎస్సార్ పీసీసీ చీఫ్ అయ్యారు. అప్పటి నుంచి బాబు వర్సెస్ వైఎస్సార్ గా సాగిన ఉమ్మడి ఏపీ పాలిటిక్స్ చివరికి 2009లో వైఎస్సార్ మరణంతో ఫుల్ స్టాప్ పడింది. అయితే 2010 నుంచి జగన్ చంద్రబాబుల మధ్య సరికొత్త రాజకీయ యుద్ధం మొదలైంది. అది నేటికీ కొనసాగుతూ వస్తోంది. ఆ విధంగా చూస్తే బాబు ఎక్కువగా జగన్ తోనే రాజకీయం చేయాల్సి వస్తోంది అనుకోవాలి. పాలకుడు అంటే కోట్లాది మంది ప్రజలకు పెద్ద. ఒక విధంగా అతి పెద్ద కుటుంబానికి యజమాని అన్న మాట. ఒక కుటుంబంలో తండ్రి సంపాదన మీద ఆధారపడిన కుటుంబ సభ్యులు ఎన్నో కోరికలు కోరుతారు. తండ్రి వారిని చేరదీసి అన్నీ చేస్తాను అని చెబుతారు. ఆశావహంగా వాతావరణం ఇంట్లో ఉండేలా చూస్తారు. అంతే తప్ప ఇది నేను చేయలేను అని తెగేసి చెప్పడు. పాలకులు కూడా అచ్చం అలాగే ఉండాలి. ప్రజలలో వివిధ వర్గాల వారు ఉంటారు, వారు అంతా పాలకులనే నమ్ముకుంటారు. అలాంటపుడు నాయకుడు వాటిని సాకారం చేయడానికే చూడాలి. ఆ విషయంలో చూస్తే చంద్రబాబుకు కొండంత ఆశావాదం ఉంది. జగన్ లో అదే కరవు అయింది అని విశ్లేషణలు ఉన్నాయి. చంద్రబాబు వయసు ఏడున్నర పదులు. ఆయన ఎర్లీ సెవెంటీస్ నుంచి పాలిటిక్స్ స్టార్ట్ చేశారు. నిజానికి బాబులో ఎక్కువ చాదస్తం ఉండాలి. కానీ ఆయన అప్టూ డేట్ గా ఉంటున్నారు. ఎప్పటికప్పుడు ప్రజల మనోభావాలకు అనుగుణంగా తనను తాను మార్చుకుంటూ ముందుకు సాగుతున్నారు. అందుకే బాబుని జెన్ జెడ్ కూడా గమనించి మద్దతు ఇస్తోంది. ఇక ఏపీ రాజధాని విషయం తీసుకుంటే బాబు ఏపీ ఆర్థిక పరిస్థితులను ఆలోచించలేదు, తన వయసుని అంతకంటే పట్టించుకోలేదు. ఏపీకి ఒక బ్రహ్మాండమైన రాజధాని కావాలని అనుకుని పూనుకున్నారు. నిజంగా ఇది హర్షించదగిన పరిణామమే. 2014లోనే బాబు ఏపీకి ఒక మాదిరి రాజధాని చాలు అనుకుంటే 2019లో ఆయనే మరోసారి విజయం సాధించేవారు అని చెబుతారు. కానీ తాను తలపెట్టేది ఈ తరానికి కాదు ఈ రోజున అయిదు కోట్లు ఉన్న ఏపీ ప్రజలు రేపటి రోజున పది కోట్లు అవుతారు అందరికీ రాజధాని అని ఆయన అమరావతి పేరుతో ఏకంగా ఒక మహా నగరం నిర్మాణానికే సిద్ధపడ్డారు. ఆ విషయంలో బాబు ఆశావాదాన్ని ఆయన కొండంత సంకల్పాన్ని ప్రశంసించాల్సిందే. బాబు పెద్ద ఆలోచనే చేశారు. అది ఏపీ శక్తికి మించి చేశారు. సంకల్పం ఉంటే సాకారం కష్ట సాధ్యం కాదన్నది ఆయన ఆలోచన. అందుకే అమరావతి విషయంలో బాబు ఎక్కడా తగ్గడం లేదు, ఆయన ధైర్యం పట్టుదల చూసే ఏపీలో అయిదు కోట్ల మంది అమరావతి పూర్తి అవుతుందని నమ్మకంతో ఉన్నారు. బాబు సైతం అమరావతి విషయంలో కేవలం ఆలోచనలే కాదు ఆచరణలో ఏమి చేయాలో కూడా తీవ్రంగానే మథనం చేస్తూ ముందుకు సాగుతున్నారని చెప్పాలి. అమరావతి అన్నది ఒక కొలిక్కి వచ్చేలా బాబు తాపత్రయపడుతున్నారు. ఒక్కసారి కనుక అమరావతికి రూపు రేఖలు వస్తే ఇక దాని వృద్ధి ఎవరూ ఊహించలేరని అంటున్నారు. ప్రస్తుతానికి బాబు మదగజాన్ని దారికి తెచ్చే మావటీడు పడే పరిశ్రమను అంతా పడుతున్నారు అనుకోవాలి. నిజానికి పాలకుడికి ఉండాల్సిన ఆశావహ దృక్పథం అయితే బాబుకు ఉంది. అందుకే ఆయన వైపు జనాలు నిలబడ్డారు అని అనుకోవాల్సి ఉంది. ఇక జగన్ విషయానికి వస్తే ఆయన ప్రస్తుతం ఏపీ వాతావరణాన్ని ఆర్థిక పరిస్థితిని చూసి మాట్లాడుతున్నారు. అంత పెద్ద రాజధాని నిర్మాణం అన్నది జరగదు అన్నది జగన్ నిశ్చితాభిప్రాయం గా ఉంది. అందుకే ఆయన అయిదేళ్ల పాలనలో ఆ వైపు పెద్దగా చూడలేదని అంటారు. అయితే జగన్ వయసు రీత్యా చూస్తే మరో ముప్పయ్యేళ్ళ పాటు రాజకీయం చేయగలరు. నిజానికి జగన్ లాంటి వారు ఇలాంటి దీర్ఘ కాల ప్రాజెక్టులను తలకెత్తుకోవాలి. కానీ ఆయన ఎందుకో ఉన్న దాంట్లో సర్దుకోవాలని చెబుతున్నారు. పాలకుడిగా జగన్ ఆశావహం కంటే యధార్ధ వాదానికే పెద్ద పీట వేస్తున్నారు. కానీ ఒక కుటుంబం అయినా రాష్ట్రం అయినా ఎదగాలీ అంటే భారీ స్కేల్ నే ముందుకు పెట్టుకోవాలి. పెద్ద లక్ష్యాలనే చేసుకుని సాగాలి. కానీ జగన్ ఆలోచనలు అయితే పాత తరం దగ్గరే ఆగిపోతున్నాయా అన్న చర్చ సాగుతోంది. మొత్తానికి చూస్తే బాబు ఆశావహ దృక్పథమే ఇపుడు జగన్ మార్క్ వాదాన్ని ఓడిస్తోంది. ఇది కేవలం బాబు జగన్ లకే కాదు, ఎక్కడైనా పాలకుడు సానుకూల దృక్పథం తోనే ఉండాలి. అపుడే అభివృద్ధి సాధ్యపడుతుంది. మరి ఈ విషయం బాబుకు తెలిసినంతగా జగన్ కి తెలియకపోవడం వల్లనే రాజధాని విషయంలో ఇన్ని విమర్శలు ఆ పార్టీ ఎదుర్కొంటోంది అని అంటున్నారు.

# ఒక్క వైసీపీ తప్ప అమరావతికి దేశమంతా మద్దతు ఇచ్చింది

వచ్చింది. దేశ ప్రయోజనాలు అవసరం లేదు, రాష్ట్రం నాశనమైనా పర్వాలేదు, మేమనుకున్నదే జరగాలని పట్టుదలతో ఉన్నారు. మేము అమరావతికి శాసనం చేస్తే, వాళ్లు దానిని నాశనం చేయాలనుకున్నారు" అని చంద్రబాబు ఆరోపించారు.

**అమరావతి ఆవిర్భావం.. అప్పటి పరిస్థితులు**

2014లో రాష్ట్ర విభజన జరిగినప్పుడు రాజధాని, ఆదాయం లేక తీవ్ర ఆర్థిక కష్టాల్లో ఉన్నామని చంద్రబాబు గుర్తుచేశారు. ఆ క్లిష్ట సమయంలో, తనకున్న అనుభవంతో ఏడు ముంపు మండలాలను ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేస్తేనే ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తానని స్పష్టం చేయడంతో, కేంద్రం ఆర్డినెన్స్ ద్వారా ఆ ప్రక్రియను పూర్తి చేసిందన్నారు. అనంతరం, శివరామకృష్ణన్ కమిటీ నివేదిక, ప్రజాభిప్రాయం మేరకు విజయవాడ-గుంటూరు మధ్య గ్రీన్ ఫీల్డ్ రాజధానిగా అమరావతిని ఎంపిక చేశామని తెలిపారు. రైతుల త్యాగాలతో, ప్రపంచంలోనే ఆదర్శంగా నిలిచిన ల్యాండ్ పూలింగ్ ద్వారా 29 వేల మంది రైతులు స్వచ్ఛందంగా 34 వేల ఎకరాల భూమిని ఇచ్చారని, వారిని అభివృద్ధిలో భాగస్వాములను చేశామని వివరించారు.

**విధ్వంసం సృష్టించి.. భవిష్యత్తును దెబ్బతీశారు**

గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం అమరావతిపై కక్ష కట్టిందని, విధ్వంసకర రాజకీయాలతో రాష్ట్రాన్ని 30 ఏళ్లు వెనక్కి నెట్టిందని చంద్రబాబు ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజావేదికను కూల్చివేయడంతో విధ్వంసానికి నాంది పలికారని, అమరావతి పనులను నిలిపివేశారని మండిపడ్డారు. మూడు రాజధానుల డ్రామాతో ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టాలని చూశారని, సింగపూర్ కన్సార్టియం వంటి అంతర్జాతీయ సంస్థలపై అవినీతి ఆరోపణలు చేసి వెళ్లగొట్టారని విమర్శించారు. రైతులు 1631 రోజుల పాటు పోరాడితే వారిపై అక్రమ కేసులు పెట్టి హింసించారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ దుర్మార్గాల వల్లే రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయి, దక్షిణాది రాష్ట్రాల్లో అత్యల్ప తలసరి ఆదాయంతో నిలిచిందని అన్నారు.

**తిరిగి పట్టాలెక్కిన పనులు.. భవిష్యత్ ప్రణాళిక ఇదే**

ప్రజలు ఇచ్చిన అఖండ విజయంతో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని, ఇప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల డబుల్ ఇంజన్ సర్కార్‌తో అమరావతి పనులు తిరిగి ప్రారంభమయ్యాయని చంద్రబాబు తెలిపారు. అమరావతిలో 9 ప్రత్యేక నగరాలు (గవర్నమెంట్, ఫైనాన్స్, నాలెడ్జ్, జస్టిస్, హెల్త్, స్పోర్ట్స్, టూరిజం, మీడియా, ఎలక్ట్రానిక్స్ సిటీలు) నిర్మిస్తామని పునరుద్ఘాటించారు. అమరావతి ఒక సెల్ఫ్ సస్టైనబుల్, ల్యాండ్ మానిటైజేషన్ ప్రాజెక్ట్ అని, దీని ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందని, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. 2028 నాటికి ఐకానిక్ భవనాలు, ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పూర్తి చేస్తామని, 2029లో ప్రధాని మోదీ చేతుల మీదుగా వాటిని ప్రారంభిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

**ఇక శాశ్వతం.. ఎవరు ఆపలేరు**

పార్లమెంట్ చట్టబద్ధత కల్పించిన తర్వాత కూడా రాజధానిపై కొందరు అసంబద్ధ వ్యాఖ్యలు చేస్తున్నారని, "ఎక్కడ కూర్చుంటే అక్కడే రాజధాని" అనడం వారి తిక్కకు నిదర్శనమని చంద్రబాబు ఎద్దేవా చేశారు. అమరావతి అభివృద్ధిని ఎవరూ ఆపలేరని, ఇది అజేయం, అన్‌స్టాపబుల్, శాశ్వతం అని స్పష్టం చేశారు. అమరావతి, విశాఖపట్నం, తిరుపతి రీజియన్లను సమానంగా అభివృద్ధి చేస్తామని, 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను స్వర్ణాంధ్రగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలు వాస్తవాలను గ్రహించి, రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# దక్షిణ లెబనాన్.. మరో గాజా కానుందా!

ఉన్న సమయంలో ఇజ్రాయెల్ వ్యూహాత్మకంగా లెబనాన్‌పై దాడులు చేస్తోంది. రాజధాని బీరుట్ సహా ఆ దేశంలోని పలు ప్రాంతాలపై భీకర స్థాయిలో విరుచుకుపడుతోంది. ఇప్పటివరకు ఈ దాడుల్లో 1,100 మంది ప్రాణాలు కోల్పోయారు. లక్షల సంఖ్యలో ప్రజలు తమ స్వస్థలాలను వీడి పారిపోతున్నారు. ఈ దాడుల్లో ఇజ్రాయెల్.. కేవలం హెజ్‌బొల్లాపై దాడులకే పరిమితం కావడంలేదు. దక్షిణ లెబనాన్‌ను ఆక్రమించే దిశగా సాగుతోంది. ఇందుకోసం 'లితానీ' ప్రణాళిక అమలు చేస్తోంది. దీని వల్ల తమ దేశంలో 10 శాతం నుంచి 15 శాతం భూభాగం కోల్పోయే ప్రమాదం ఉందన్న తీవ్ర ఆందోళన లెబనాన్ ప్రభుత్వంలో వ్యక్తమవుతోంది.

**ఏమిటీ 'లితానీ' ప్రణాళిక**

లితానీ నది పూర్తిగా లెబనాన్ దేశంలోనే ప్రవహిస్తుంది. ఇది ఇజ్రాయెల్ ఉత్తర సరిహద్దుకు సుమారు 30 కిలోమీటర్ల దూరంలో ఉంది. దక్షిణ లెబనాన్‌ను మిగిలిన లెబనాన్ నుంచి వేరు చేసే సహజమైన సరిహద్దులా ఈ నది కనిపిస్తుంది. ఈ ప్రాంతంలో హెజ్‌బొల్లా మిలిటెంట్లు, వారి ఆయుధాలు ఉండకూడదని ఇజ్రాయెల్ అంటోంది. అందుకే ఆ ప్రాంతంలోని హెజ్‌బొల్లా స్థావరాలను, లితానీపై వంతెనలను, గ్రామాల్లో ఇళ్లను ధ్వంసం చేసి, అక్కడ ఒక 'భద్రతా జోన్' ఏర్పాటు చేయాలని భావిస్తోంది. ఈ దాడులను లెబనాన్ అధ్యక్షుడు జోసెఫ్ ఔన్ తీవ్రంగా ఖండించారు. దక్షిణ లెబనాన్‌ను దేశం నుంచి వేరు చేసి, అక్కడ శాశ్వత ఆక్రమణ చేయడానికి ఇజ్రాయెల్ కుట్ర చేస్తోందని ఆరోపించారు.

**ఇజ్రాయెల్ లక్ష్యమేంటి?**

2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి చేసి 1,200 మందిని హతమార్చిన సంగతి తెలిసిందే. ఆ దాడి తరహాలోనే ఇజ్రాయెల్ ఉత్తర ప్రాంతంపై హెజ్‌బొల్లా విరుచుకుపడే అవకాశం ఉందని ఇజ్రాయెల్ భయం. అందుకే ఆ మిలిటెంట్ సంస్థను లితానీ నది అవతలకు పరిమితం చేస్తే, ఉత్తర ఇజ్రాయెలీ ప్రజలు సురక్షితంగా ఉంటారని భావిస్తోంది. హెజ్‌బొల్లా దాడులతో ఉత్తర ఇజ్రాయెల్‌లోని సుమారు 60,000 నుంచి 80,000 మంది ప్రజలు తమ ఇళ్లను వదిలి వెళ్లిపోయారు. వీరంతా సురక్షితంగా తమ స్వస్థలాలకు చేరాలంటే 'లితానీ నదే కొత్త సరిహద్దు కావాలి' అని ఇటీవల ఇజ్రాయెల్ ఆర్థిక మంత్రి బెజలెల్ స్మోట్రిచ్ ప్రకటించారు. ఇందుకు అనుగుణంగానే గాజా తరహా ప్రణాళికను టెల్ అవీవ్ అనుసరిస్తోంది. గాజాలోని కీలక నగరాలను ధ్వంసం చేసినట్లే.. దక్షిణ లెబనాన్‌లోని గ్రామాలనూ ఇజ్రాయెల్ నేలమట్టం చేస్తోంది. లితానీ నదిపైన ఉన్న 7 వంతెనలను ఇటీవల కూల్చివేసింది.

**అడకత్తెరలో లెబనాన్ ప్రభుత్వం**

కరవమంటే కప్పకు కోపం.. విడవమంటే పాముకు కోపం అన్నట్టుంది లెబనాన్ ప్రభుత్వ పరిస్థితి. ఇజ్రాయెల్, హెజ్‌బొల్లా మధ్యలో నలిగిపోతోంది. బీరుట్ సహా కీలక ప్రాంతాలపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడులను నిలువరించలేకపోతోంది. అంత సైనిక శక్తి లెబనాన్ దగ్గర లేదు. అందుకే ఇటీవల చర్చలకు సిద్ధమని ప్రకటించింది. ఈ పిలుపును ఇజ్రాయెల్ పట్టించుకోవడం లేదు. దాడులు చేస్తూనే ఉంది. మరోవైపు హెజ్‌బొల్లాపై లెబనాన్ ప్రభుత్వం విధిస్తున్న నియంత్రణలూ ఫలితం ఇవ్వడం లేదు. ఇప్పటికే ఈ మిలిటెంట్ సంస్థ కార్యకలాపాలను చట్టవిరుద్ధం అని ప్రకటించింది. అయినా ఇజ్రాయెల్‌పై దాడులను హెజ్‌బొల్లా ఆపడం లేదు.

## మొదటి పేజీ తరువాయి

### పౌరులే దేవుళ్లు

వారోత్సవం-2026' ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ ప్రసంగించారు. ఉత్తరాది నుంచి దక్షిణాది వరకు యావత్ దేశంలోని అన్ని స్థాయిల సివిల్ సర్వెంట్లు పౌర కేంద్రక ప్రజా సర్వీసులనే అందిస్తున్నారని తెలిపారు. ప్రతీ ప్రభుత్వ ఉద్యోగి పని సామర్థ్యాన్ని పెంచేందుకు కర్మయోగి సాధనా వారోత్సవం దోహదం చేస్తుందని అభిప్రాయపడ్డారు. ప్రజా సర్వీసులను మరింత మెరుగ్గా మార్చడానికి, ప్రజలకు ఉపయోగకరంగా మల్చడానికి నిత్యం తమ ప్రభుత్వం శ్రమిస్తోందని వెల్లడించారు.

### 2047 నాటికి తెలంగాణను టెక్స్‌టైల్ రాజధానిగా మారుస్తాం

టెక్స్‌టైల్ కాన్ఫరెన్స్ 2026లో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో తయారైన వస్త్రాలను ప్రపంచంలోని ప్రతి దేశంలో ప్రజలు ధరించేలా చేయాలన్నదే తన ఆశయమని అన్నారు. టెక్స్‌టైల్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే వారికి అన్ని రకాలుగా అండగా ఉంటామని సీఎం భరోసా ఇచ్చారు. పెట్టుబడిదారులకు అవసరమైన భూమి, విద్యుత్, నీరు, రాయితీలతో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, అనుమతులు కూడా వేగంగా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. "మీకు విజన్ ఉంటే, మీకు సరైన భాగస్వాములం మేమే. కలిసికట్టుగా ప్రపంచాన్ని మార్చగల టెక్స్‌టైల్ వ్యవస్థను నిర్మిద్దాం" అని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ వస్త్రాలకు ఘనమైన చరిత్ర ఉందని, పోచంపల్లి ఇక్కత్, గద్వాల చీరల నుంచి వరంగల్ దర్రీల వరకు ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయని సీఎం గుర్తుచేశారు. దేశంలోనే అత్యధికంగా నాణ్యమైన పత్తిని ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణకు ప్రపంచవ్యాప్త గుర్తింపు ఉందని తెలిపారు. వరంగల్‌లో ప్రపంచ స్థాయి కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ అందుబాటులో ఉందని వివరించారు. హైదరాబాద్ ఫిల్మ్ ప్రొడక్షన్‌కు హబ్‌గా మారుతోందని, నెట్‌ఫ్లిక్స్ వంటి సంస్థలు ఇక్కడ స్టూడియోలు ఏర్పాటు చేస్తున్నాయని సీఎం అన్నారు. బాలీవుడ్‌తో పాటు ఇప్పుడు హాలీవుడ్ కూడా హైదరాబాద్ వైపు చూస్తోందని, సినిమా పరిశ్రమ ఫ్యాషన్ అవసరాలను స్థానికంగానే తీర్చేలా ప్రోత్సహిస్తామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్రంలో గ్రీన్ టెక్స్‌టైల్ హబ్‌లను అభివృద్ధి చేస్తామని, యువతకు, ముఖ్యంగా మహిళలకు నైపుణ్య శిక్షణ ఇస్తామని రేవంత్ రెడ్డి వెల్లడించారు.

### అప్పుడు వారు నాలుగు పెళ్లిళ్లు చేసుకోలేరు

ద్వారా అడ్డుకునే వీలు ఉంటుందన్నారు. "ఆదివాసీల అభివృద్ధి కోసం ప్రధాని మోదీ, అస్సాం ముఖ్యమంత్రి రోడ్ మ్యాప్ సిద్ధం చేశారు. మోదీ నాయకత్వంలో ఆదివాసీ మహిళ దేశ ప్రథమ పౌరురాలు అయ్యారు" అని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లో యూసీసీని బలవంతంగా రుద్దుతారంటూ కాంగ్రెస్ చేస్తున్న ప్రచారాన్ని ఆయన తిప్పికొట్టారు. ఈ సందర్భంగా ఇటీవల మేఘాలయలో తలెత్తిన ఉద్రిక్తతలను ప్రస్తావించారు. చొరబాటుదారులు అక్కడి ఆదివాసీ మహిళలను వివాహం చేసుకోవడం ద్వారా రాజకీయ పలుకుబడిని సంపాదించడానికి ప్రయత్నించారని, ఇది ఉద్రిక్తతలకు దారితీసిందని ఆయన ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే.. అక్రమ చొరబాట్ల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. "అస్సాంలో మాకు మరో ఐదేళ్ల సమయం ఇవ్వండి. రాష్ట్రానికి చొరబాటుదారుల నుంచి విముక్తి కల్పించేలా చర్యలు తీసుకుంటాం. అస్సాంలో యూసీసీని అమలు చేస్తాం. దాంతో చొరబాటుదారులు నాలుగు పెళ్లిళ్లు చేసుకోలేరు" అని వెల్లడించారు.

# హైదరాబాద్‌లో పుట్టి పెరిగా..ఆ రోజు మెడపట్టి గెంటివేశారన్న బాధ ఉంది

ఉన్న సమయంలో రెండు ప్రాంతాలకు న్యాయం చేసి ముందుకు వెళ్లాలని లేకపోతే విభజన వల్ల ఒక ప్రాంతం లబ్ధి పొందినా మరో ప్రాంతం తీవ్రంగా నష్టపోతుంది చెప్పారని గుర్తు చేశారు. అయినా వినకుండా ఏకపక్షంగా ఆంధ్రరాష్ట్రాన్ని విభజించారని ఆరోపించారు. తాను పుట్టిపెరిగింది తెలంగాణాలోనే అని, హైదరాబాద్‌లో ప్రతి గల్లీ తనకు తెలుసు అన్నారు. అయితే ఆరోజున కట్టుబట్టలతో మెడబట్టి బయటకు గెంటేశారన్న బాధ, ఆవేదన కలిగిందని అన్నారు. రాజధాని ఎక్కడ పెట్టాలో తెలియదు, కూర్చునేదానికి సెక్రటేరియట్ లేదు, శాసనసభ సమావేశాలు నిర్వహించుకునేందుకు అసెంబ్లీ లేదు, హైకోర్టు లేదు, పదేళ్లు హైదరాబాద్ మీ రాజధాని, ఆ తర్వాత మీదారి మీరు వెతుక్కోండని విభజన సమయంలో చెప్పారని ఆవేదన వ్యక్తం చేశారు.

**అశాస్త్రీయ రాష్ట్ర విభజన దారుణం**

విభజన ఎంత దారుణంగా జరిగిందంటే షెడ్యూల్ 9, 10 సంస్థలు ఇప్పటికీ అటు తెలంగాణ, ఇటు ఆంధ్ర రాష్ట్రానివో తేలని దుస్థితి నెలకొందని అన్నారు. అశాస్త్రీయంగా జరిగిన విభజన వల్ల ఇప్పుడు కూడా తెలుగు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఆనాడు హైదరాబాద్ లో గల శాసనసభలో ఏపీ అసెంబ్లీ సమావేశం జరిగిందని, ఆ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చాలా స్పష్టంగా అటు ఉత్తరాంధ్రకు, ఇటు రాయలసీమకు సమదూరంలో రాజధాని ఉండాలని చెప్పారని గుర్తు చేశారు. ఆ రాజధాని అమరావతి అని ఆనాడు ప్రకటించారని అన్నారు. ఆ సమయంలో అభివృద్ధి వికేంద్రీకరణ చేసి చూపిస్తామని చెప్పారని, అందులో భాగంగా రైతులు ముందుకొచ్చి భూములు ఇచ్చారని అన్నారు. ప్రధానమంత్రి స్వయంగా వచ్చి అమరావతి పనులకు శంకుస్థాపన చేశారని అన్నారు. ఆనాడు రైతులకు తెలుగుదేశం, బీజేపీ, జనసేన, చివరకు వైసీపీ కూడా భరోసా ఇచ్చాయని గుర్తు చేశారు. అందరూ అమరావతికి సంపూర్ణ మద్దతు తెలిపారని, అందుకే 5 కోట్ల ఆంధ్రుల కోసం తమ భూములు రాజధాని కోసం ఇస్తున్నామని అక్కడి రైతులు చాలా స్పష్టంగా చెప్పారని అన్నారు.

**మూడు ముక్కలాటపై అలుపెరుగని పోరాటం**

పొరపాటున ప్రభుత్వం మారితే అమరావతి రాజధానిగా ఉండదు, తరలిస్తారని తాము 2019 ఎన్నికలకు ముందు చాలా స్పష్టంగా ప్రజలకు చెప్పామని లోకేశ్ తెలిపారు. ఆనాటి ప్రతిపక్షనేత, ప్రస్తుత పులివెందుల ఎమ్మెల్యే జగన్ తాను ఇక్కడే ఇల్లు కట్టుకున్నాను, రాజధానిని ఎక్కడకూ తీసుకెళ్లనని చెప్పి ప్రజలను మోసగించారని ఆరోపించారు. ఆయన అధికారంలోకి వచ్చిన తర్వాత రాజధానిపై అనేక ఆరోపణలు చేసి మూడుముక్కలాట మొదలుపెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ రోజు శాసనసభలో తమ ఎమ్మెల్యేలు పోరాడారని, కౌన్సిల్‌లో మాకు మెజారిటీ ఉండటంతో కౌన్సిల్ సాక్షిగా మేమంతా పోరాడామని అన్నారు. తాను కూడా ఆనాడు శాసనమండలిలో ఎమ్మెల్సీగా ఉన్నానని గుర్తు చేసుకున్నారు. బిల్లును సెలక్ట్ కమిటీకి పంపించాలని సభ్యులమంతా కోరినా, అప్పటి శాసనసభా వ్యవహారాల మంత్రి మంత్రి బొత్స సత్యనారాయణ చైర్మన్ సంతకం లేకుండా బిల్లు పాసైందని చెప్పి, గవర్నర్ ఆమోదానికి పంపించారని మండిపడ్డారు. తెలిసో, తెలియకో గవర్నర్ ఆ రోజు అనుమతి ఇచ్చారని అన్నారు. తాము న్యాయపోరాటం చేయగా, వారు తప్పుచేశారని కోర్టు అక్షింతలు వేసిందని తెలిపారు.

**రైతులను వెంటాడి వేధించారు**

"ఆరోజు నుంచి ప్రజారాజధాని కోసం ఉద్యమం మొదలైంది. పెద్దఎత్తున రైతులు, మహిళలు రోడ్డుపైకి వచ్చి 5 కోట్ల ఆంధ్రుల కోసం పోరాడారు. ఉద్యమించినందుకు వారిని అన్నిరకాలుగా అవమానించారు, వారిపై దాడిచేశారు. శాంతియుతంగా వారు అమరావతి నుంచి తిరుమలకు, సింహాచలంకు పాదయాత్ర చేయాలన్నా అనేక ఇబ్బందులు పెట్టారు, అవమానించారు. రాజధాని గ్రామాల్లో ప్రజలు స్వస్థలాల్లో తిరగాలంటే ఆధార్ కార్డు చూపించాల్సిన పరిస్థితులు కల్పించారు, ఐదేళ్లు 144వ సెక్షన్ పెట్టారు. ప్రజలను అన్నిరకాలుగా వేధించారు. 5కోట్ల ఆంధ్రులు అదంతా ప్రత్యక్షంగా చూశారు. అందుకే వారిలో ఆవేదన, బాధ కలిగాయి. ఆనాడు మేం చాలా స్పష్టంగా ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని అమరావతి, అభివృద్ధి వికేంద్రీకరణ చేసి చూపిస్తామని చెప్పాం. అదే నినాదంతో మేమంతా ఎన్డీయే కూటమిగా గత ఎన్నికల్లో కలసికట్టుగా పోటీచేశాం. అందుకే ప్రజలు 94 శాతం మ్యాండేట్ ప్రజలు మాకిచ్చారు. గత పాలకులు ఎక్కడ ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్ పెడతామని మాయమాటలు చెప్పారో అక్కడే విశాఖ ప్రజలు మా ఎంపీని అత్యధికంగా 5 లక్షల ఓట్లకు పైగా భారీ మెజారిటీతో గెలిపించారు. విశాఖతో పాటు శ్రీకాకుళం, విజయనగరం, హిందూపూర్, అనంతపూర్, చిత్తూరు జిల్లాల ప్రజలంతా అమరావతికే మద్దతుగా నిలిచారు. ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని, అమరావతే మా రాజధాని అని తెలుగు ప్రజలు స్పష్టం చేశారు" అని లోకేశ్ తెలిపారు.

**ప్రధాని ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు**


ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత టీమ్ -11 అనేక దుష్ప్రచారాలు చేసిందని, ఇప్పుడు కూడా చేస్తున్నారని లోకేశ్ వాపోయారు. మళ్లీ పొరపాటున అధికారంలోకి వస్తే 3 రాజధానులు చేస్తామని ఇప్పుడు కూడా చెబుతున్నారని ధ్వజమెత్తారు. వారి తప్పుడు ప్రచారం ఆంధ్రరాష్ట్రానికి, అమరావతికి రావాల్సిన పెట్టుబడులు నెమ్మదించాయని అన్నారు. ఇప్పటికే చాలా నష్టపోయాం, మా భవిష్యత్తు ఏమిటని రైతుల్లో కూడా ఆందోళన వచ్చిందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ కు అమరావతి ఏకైక శాశ్వత రాజధానిగా చట్టబద్ధత ఉండాలని రైతులంతా కోరారని, అందులో భాగంగా సభలో రోజంతా దీనిపై చర్చించినట్లు తెలిపారు. అమరావతే శాశ్వత రాజధానిగా ఉండాలని ఏకగ్రీవంగా శాసనసభలో తీర్మానం చేసి పార్లమెంటుకు పంపించారని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పార్లమెంటులో బిల్లు పాస్ చేయించేందుకు చొరవచూపారని వెల్లడించారు.

**యావత్ భారతదేశం అండగా నిలబడింది**

"అమరావతికి మద్దతివ్వడం ప్రారంభం మాత్రమే, అంతా ఆంధ్రప్రదేశ్ కు అండగా నిలబడాలని, ఇప్పటికే అనేక ఇబ్బందులు ఎదుర్కొంది. అయిదేళ్లు చాలా నష్టపోయింది. టీమ్-11 పార్టీ మినహా మేమంతా అండగా ఉంటామని అన్నిపార్టీలు కలసికట్టుగా మద్దతునిచ్చాయి. బీజేపీ, జనసేన, జేడీయు, అటుపక్కన కాంగ్రెస్, టీఎంసీ, ఆమ్ ఆద్మీ పార్టీ, సమాజ్‌వాది పార్టీ ఇలా అందరూ ముక్తకంఠంతో ఏపీ శాశ్వత రాజధాని అమరావతి అని మాట్లాడారు. ఈరోజు కూడా రాజ్యసభలో కరెక్టుగా 11పార్టీలు మాట్లాడాయి. గత పాలకులు చేసిన పొరపాట్లకుగాను 11 నెంబర్ వారిని వెంటాడుతోంది. ఒకపార్టీ మాత్రం వాకౌట్ చేసింది. అది ప్యాషనో, మరేమిటో సీసీడీ (క్రెడిట్ చోరీ డిజార్డర్) ఉన్న వ్యక్తిని మీరంతా అడగాలి. మొత్తం భారతదేశం ఈరోజు ఆంధ్రులకు అండగా నిలబడింది. ఇందుకు రాష్ట్రప్రజలంతా గర్వపడాలి. మాపై ఉంచి నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం. తప్పనిసరిగా అమరావతి పనులు పూర్తిచేస్తాం.

# ప్రతిభావంతులైన బాలికలకు నగదు ప్రోత్సాహకాలు

## ముఖ్య అతిథిగా దల్లి గోవిందరెడ్డి






**సిటిజన్ టైమ్స్ గాజువాక, ఏప్రియల్ 03**

మలబార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా గాజువాక షోరూం పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివిన ప్రతిభావంతులైన బాలికలకు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. గాజువాక బీసీ రోడ్డులోని స్వామి కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 112 మంది విద్యార్థులకు మొత్తం రూ. 8.96 లక్షల నగదుతో పాటు ప్రశంసా పత్రాలు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దల్లి గోవిందరెడ్డి హాజరయ్యారు. మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ తరఫున అసిస్టెంట్ స్టోర్ హెడ్ మొహమ్మద్ షాహీన్ ఇషాక్, అసిస్టెంట్ షోరూమ్ మేనేజర్ ఎన్.ఎల్. అనూష పాల్గొన్నారు. అలాగే కార్పొరేటర్లు పల్లా శ్రీనివాసరావు, పులి లక్ష్మీబాయి కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ వ్యాపార రంగంలో అభివృద్ధి సాధిస్తూ సామాజిక సేవలో భాగంగా ప్రతి సంవత్సరం కోట్లాది రూపాయలు ఖర్చు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ఇలాంటి నగదు ప్రోత్సాహకాలు అందించడం వలన వారిలో మరింత ఉత్సాహం పెరిగి, ఉన్నత విద్యకు ఆర్థికంగా తోడ్పాటు లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి డీఐఈఓ వినోద్ బాబు, ఎంఈఓ త్రినాథరావు, ఇతర అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్‌కు ఘనంగా వీడ్కోలు పలికిన అధికారులు సిబ్బంది





**పాడేరు, సిటిజన్ టైమ్స్, ఏప్రిల్ 03:**

అల్లూరి జిల్లా కలెక్టర్ ఏ.ఎస్. దినేష్ కుమార్ బదిలీ సందర్భంగా పాడేరులో గురువారం జిల్లా యంత్రాగం ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికింది. ఈ కార్యక్రమం అంబేద్కర్ సర్కిల్ నుండి కలెక్టరేట్ వరకు సాగిన, భారీ ఊరేగింపుతో పండగల ప్రారంభమైంది.దారి పొడవునా అధికారులు సిబ్బంది పూల వర్షం కురిపిస్తూ, గిరిజననృత్యాలు మరియు వాయిద్యాలతో, కలెక్టర్ పై తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు.అనంతరం జరిగిన సత్కార సభలో జిల్లా అధికారులు కలెక్టర్ ను దుశ్యాలువాలు, మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. ఇంచార్జి ఆర్ డి ఓ మాట్లాడుతూ ద్రోణాచార్యుడు బుద్ధుడి వంటి గురువులతో పోల్చగా, ఐటిడిఏ పిఓ శ్రీ పూజ కాఫీ ఉత్పత్తుల అభివృద్ధికి గిరిజన సమస్యల పరిష్కారానికి ఆయన అందించిన సూచనలు గుర్తు చేసుకున్నారు కలెక్టర్ ది నేష్ కుమార్ తన ప్రసంగంలో ఏజెన్సీ ప్రాంతంలో పనిచేయడం ఒక విభిన్నమైన సవాలుతో కూడిన అనుభవం అని పేర్కొన్నారు. గిరిజన బిడ్డలు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ అధికారులు ప్రజల సమస్యలను ఓర్పుతో విని పరిష్కరించాలని సూచించారు. అరకు కాఫీకి అంతర్జాతీయ గుర్తింపు రావడం రికార్డులు సాధించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేస్తూ, 2029 నాటికి అల్లూరు జిల్లాను ఆర్గానిక్ జిల్లాగా చూడాలని ఆకాంక్షించారు. శిక్షణ పూర్తి చేసుకున్న అసిస్టెంట్ కలెక్టర్ను కూడా ఈ సందర్భంగా అధికారులు సత్కరించారు ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారులు వివిధ శాఖల సిబ్బంది ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విజయవంతంగా శబలా భోజనాల సంబరాలు

## - తండోపతండాలుగా తరలివస్తున్న అభిమానులు - జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చిన భోజనం

## - మన ప్రకృతి వనరుల పరిరక్షణ బాధ్యత మనదే - చిరంజీవి చౌదరి, కార్యదర్శి, రాష్ట్ర ఫుడ్ ప్రోసెసింగ్ విభాగం







**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రిల్ 03**

విజయవంతంగా శబలా భోజనాల సంబరాలు నిర్వహించుకున్నారు అని ఫుడ్ ప్రాసెసింగ్ రాష్ట్ర విభాగం కార్యదర్శి చిరంజీవి చౌదరి అన్నారు. శుక్రవారం ఉదయం సింహాచలం గోశాల వద్ద సేవ్ సంస్థ నిర్వహించిన శబల భోజనాల పండుగ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. తండోపతండాలుగా తరలివస్తున్న అభిమానులను చూస్తుంటే ప్రకృతి వ్యవసాయదారుల మీద పెరుగుతున్న అభిమానానికి నిదర్శనం అన్నారు. ఈ భోజనాలు పండుగ జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చిపెట్టింది అన్నారు. మన ప్రకృతి వనరుల పరిరక్షణ బాధ్యత మనదే అన్నారు. భారత కిసాన్ సంఘ్ జాతీయ కార్యవర్గ సభ్యులు జలగం కుమారస్వామి మాట్లాడుతూ ప్రకృతి ఆధారంగా మాత్రమే పంటలు పండించడం అవసరం అన్నారు. వేలాది మంది ఈ భోజనాలు పండుగను జయప్రదం చేయడం ఆనందంగా ఉంది అన్నారు. ఆంధ్రా విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపకులపతి జి ఎస్ ఎన్ రాజు మాట్లాడుతూ ప్రకృతి ఆధారంగా వ్యవసాయం చేయడం అవసరం అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రకృతి ఆధారంగా పంటలు పండించే రైతుల సంఖ్య పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సేవ్ సంస్థ వ్యవస్థాపకులు విజయరాం, మిలెట్స్ రాంబాబు, ఆయుర్వేద వైద్యులు సుందరరాజ పెరుమాళ్, జిల్లా అటవీ శాఖ అధికారి రవీంద్ర ధామా, వీఎంఆర్ డిఏ చీఫ్ అర్బన్ ప్లానర్ వి.శిల్ప, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ విజయ ప్రసాద్, విశాఖ పోర్టు ట్రస్టు ఉద్యానవన అధికారి రాధిక, ఫుడ్ ప్రాసెసింగ్ విభాగం ఉత్తర ఆంధ్ర అధికారి జనార్ధన్ లు మాట్లాడారు. ఉత్తర ఆంధ్ర జర్నలిస్ట్ ఫ్రంట్ అధ్యక్షులు వర్మ తమ సంస్థ డైరీలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంకల్ప కళా గ్రామం ప్రతినిధి ఆకుల చలపతి రావు, తులసి నేచురల్స్ సత్యనారాయణ, మేంగో మేన్ అప్పాజీ, దేశీయ ఆవులు ప్రదర్శన నిర్వహించిన మహేష్ , మేడ్ గార్డెనర్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

# సిగ్గుతో తలదించుకునేలా గురుకుల పాఠశాల పరిస్థితి

## సౌకర్యాల లేమి పట్ల గంటా ఆగ్రహం -బాధ్యులపై కఠిన చర్యలకు ఆదేశం



**సింహాచలం, సిటిజన్ టైమ్స్, ఏప్రిల్ 3**

మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలలో నెలకొన్న దయనీయ పరిస్థితుల పట్ల భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్ లో నిర్లక్ష్యంగా వ్యవహరించడానికి సైతం భయపడేలా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ ను ఆదేశించారు. పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. డార్మెటరీలు టాయ్ లెట్లు, కిచెన్, స్టోర్ రూం లను పరిశీలించారు. డార్మెటరీలో బెడ్స్ విద్యార్థులు వాడుకోవడానికి వీలు లేని దారుణమైన స్థితిలో ఉన్నాయన్నారు. తీవ్ర దుర్గంధం వల్ల టాయ్ లెట్ల దగ్గరకు వెళ్లలేని దుస్థితి ఉందని.. ప్రిన్సిపాల్ కు తప్పదు కాబట్టి తనతో వచ్చారని, కేడర్ కూడా కలిసి రాలేనంత ఘోరంగా టాయ్ లెట్ల పరిసరాలు ఉన్నాయని అసంతృప్తి వ్యక్త పరిచారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో ఇలాంటి పరిస్థితులు ఉండడం చాలా అవమానకరంగా ఉందన్నారు. నిద్రపోతున్న విద్యార్థులను ఎలుకలు కొరకడం అత్యంత బాధాకరమైన విషయంగా గంటా చెప్పారు. సిగ్గుతో తలదించుకునేలా ఉన్న గురుకుల పాఠశాల సమస్యలు త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కిచెన్, స్టోర్ కొంత పర్వాలేదని, ఎలుకల సమస్య పరిష్కారానికి చర్యలు మొదలుపెట్టారని చెప్పారు. విద్యా, వైద్య రంగానికి ప్రభుత్వం వేల కోట్లు ఖర్చుచేస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మంచి ఉపాధ్యాయులు ఉంటారని, ఉచిత మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలు ఉన్నా.. పిల్లల భవిష్యత్ బాగుండాలని 90 శాతం మంది పేద తల్లిదండ్రులు లక్షల ఫీజులు కట్టి ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పిస్తున్నారని చెప్పారు. తల్లిదండ్రుల్లో నమ్మకం కలిగించేలా ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల స్థాయి పెంచాలన్నారు. ఎన్టీఆర్ ప్రారంభించిన ప్రతిష్టాత్మక గురుకుల పాఠశాలలో అసంపూర్తి భవనాలు.. డార్మెటరీ.. కిచెన్.. డైనింగ్ హాల్ తదితర సమస్యలను ఇప్పటికే విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకు వెళ్లానని, పరిష్కారానికి ఆయన హామీ ఇచ్చారని వివరించారు. అనంతరం విద్యార్థుల కోసం తయారు చేసిన భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పురుషోది, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, పీవీ నరసింహం, గాడు చిన్ని కుమారి లక్ష్మి, కంటుభుక్త రామానాయుడు, పంచదార్ల శ్రీనివాస్, గుసిడి శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ నేతల భూ దందా బహిర్గతం..?

## “అధికారాన్ని కవచంగా చేసుకుని పేదలపై భూ దాడి”

## న్యాయం కోసం అంతర్జాతీయ వేదిక కు బాధితుల పయనం

## ఎవరు కబ్జాదారులు? ఎవరు సహకారులు? త్వరలో పూర్తి వివరాలు!

**సిటిజన్ టైమ్స్ ప్రత్యేక ప్రతినిధి**
**శ్రీకాకుళం సిటీ ఏప్రియల్ 03**




జిల్లాలో వైసీపీ నేతల భూ కబ్జా వ్యవహారం రోజురోజుకు తీవ్ర రూపం దాల్చుతోంది. అధికారంలో ఉన్న సమయంలో కొందరు ప్రభావశీల నేతలు చట్టాన్ని పూర్తిగా పక్కనపెట్టి పేదల భూములను లక్ష్యంగా చేసుకుని కబ్జాలకు పాల్పడ్డారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బాధితుల వాంగ్మూలాల ప్రకారం, అధికార దుర్వినియోగంతో రెవెన్యూ వ్యవస్థను ప్రభావితం చేసి, పథకం ప్రకారం భూములను తమ పేర్లకు మలచుకున్నట్లు తెలుస్తోంది. ఈ అక్రమాలకు వ్యతిరేకంగా నోరు విప్పిన వారిని బెదిరించడం, ఒత్తిళ్లు తేవడం, దాడులకు దిగడం వంటి సంఘటనలు చోటుచేసుకున్నాయని బాధితులు వాపోతున్నారు. ఇందులో కొన్ని కీలక రాజకీయ నేతల ప్రమేయం ఉన్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. అప్పటి పరిస్థితుల్లో భయంతో ఎవరూ ముందుకు రాలేకపోయినా, ఇప్పుడు ఒక్కొక్కటిగా నిజాలు వెలుగులోకి వస్తున్నాయని చెబుతున్నారు. న్యాయం కోసం అలమటిస్తున్న బాధితులు చివరికి అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థలను ఆశ్రయించడం ఈ వ్యవహారం తీవ్రతను మరింత స్పష్టంగా చూపిస్తోంది. సమగ్ర, నిష్పక్షపాత విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారానికి సంబంధించిన పూర్తి వివరాలు బయటకు వచ్చిన తర్వాత, అక్రమ కబ్జాదారులపై మాత్రమే కాకుండా, వారికి కొమ్ముకాసిన అధికారులు, నాయకులపై కూడా ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుంటుందో చూడాల్సి వుంది. చట్టం అందరికీ సమానమా? లేక అధికారానికి అనుగుణంగా మారుతుందా? అనే ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత ఇప్పుడు ప్రభుత్వంపై ఉంది. బాధితులకు న్యాయం జరుగుతుందా? లేక ఈ వ్యవహారం కూడా మరుగున పడుతుందా? అన్నది ఇప్పుడు ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. శ్రీకాకుళం జిల్లా లో గతంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని కొందరు వైసీపీ నేతలు, వారి అనుచరులు చేపట్టిన భూ కబ్జాల వ్యవహారంపై “సిటిజన్ టైమ్స్” ప్రత్యేక నిఘా కొనసాగుతోంది.

# విశాఖ సిటీ పోలీస్ జట్టుకు ఘన విజయం

## కస్టమ్స్‌పై 114 పరుగుల తేడాతో దుమ్మురేపిన సిటీ పోలీస్



**సిటిజన్ టైమ్స్ విశాఖపట్నం ఏప్రిల్ 03**

విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ తృష్ణ గ్రౌండ్‌లో జరిగిన వదకా విడిసిఎ ఇన్స్టిట్యూషనల్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌లో విశాఖపట్నం సిటీ పోలీస్ క్రికెట్ జట్టు అద్భుత ప్రదర్శనతో కస్టమ్స్ జట్టుపై 114 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన సిటీ పోలీస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 180 పరుగుల భారీ స్కోర్ నమోదు చేసింది. జట్టుకు బలమైన పునాది వేసిన టి. రాజు 44 బంతుల్లో 78 పరుగులు (8 ఫోర్లు, 3 సిక్సర్లు) చేసి ఆకట్టుకోగా, వి. త్రినాథ్ 41 బంతుల్లో 50 పరుగులు (5 ఫోర్లు, 1 సిక్స్) చేసి జట్టుకు కీలక సహకారం అందించారు. అనంతరం 181 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన కస్టమ్స్ జట్టు సిటీ పోలీస్ బౌలర్ల ధాటికి తట్టుకోలేక 14.3 ఓవర్లలో కేవలం 66 పరుగులకే ఆలౌట్ అయింది. కస్టమ్స్ జట్టులో మహేశ్ చేసిన 21 పరుగులు తప్ప మరెవ్వరూ గణనీయంగా రాణించలేకపోయారు. సిటీ పోలీస్ బౌలింగ్ విభాగంలో ఎల్. శ్రీను 3 వికెట్లు (3/21), టి. ఉమా మహేశ్వరరావు 3 వికెట్లు (3/21), పి. హేమసుందర్ 2 వికెట్లు (2/13) తీసి ప్రత్యర్థి జట్టును కట్టడి చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. ఈ విజయం ద్వారా విశాఖ సిటీ పోలీస్ జట్టు టోర్నమెంట్‌లో తమ ఆధిపత్యాన్ని చాటుకుంది.


# గంటా శ్రీనివాసరావు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన కె. కె. రాజు

**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రిల్ 03**



మాజీ ముఖ్యమంత్రి వర్యులు వై.యస్ జగన్ మోహన్ రెడ్డి పై ఈ రోజు గంటా శ్రీనివాసరావు చేసిన అనుచిత వ్యాఖ్యలు పూర్తిగా ఖండనీయమని, విశాఖ జిల్లా వైఎస్సార్సీపీ అధ్యక్షులు కె కె రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయంగా, ఆర్థికంగా ఎదగడానికి విశాఖ ప్రజల మద్దతు తీసుకున్న గంట శ్రీనివాసరావు , అదే విశాఖను రాజధానిగా సమర్థించకుండా అమరావతి వైపు మొగ్గు చూపడం ప్రజల విశ్వాసానికి చేసిన మోసం అని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇది ప్రజల ప్రయోజనాల కోసం కాదు. కేవలం నారా చంద్రబాబు నాయుడు మరియు లోకేష్ మెప్పు కోసం, వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాల కోసం చేసిన వ్యాఖ్యలు మాత్రమే అని ప్రజలు స్పష్టంగా అర్థం చేసుకుంటున్నారుఅని అన్నారు ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం నాటి ముఖ్య మంత్రి వర్యులు జగన్ మోహన్ రెడ్డి విశాఖ ను రాజధానిగా ప్రకటించినప్పుడు కనీస మద్దతు తెల్పకుండా గతంలో మౌనం వహించిన గంట శ్రీనివాసరావు ... ఇప్పుడు అమరావతిని రాజధానిగా ప్రకటించగానే హర్షం వ్యక్తం చేయడం ఆయన రాజకీయ ద్వంద్వ వైఖరికి అద్దం పడుతోంది. ప్రజాధనాన్ని కాపాడాలని, రాష్ట్రాన్ని సమానంగా అభివృద్ధి చేయాలని భావించిన దూరదృష్టి నాయకుడు జగన్ అని అన్నారు అలాంటి నాయకుడిపై విమర్శలు చేయడం అంటే... ప్రజల అభివృద్ధి ఆశయాలపై దాడి చేయడమే. గంట శ్రీనివాసరావు వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని, విశాఖ ప్రజలకు క్షమాపణ చెప్పాలని కె. కె రాజు గట్టిగా డిమాండ్ చేశారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధితో నిరుపేదలకు భరోసా





**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రిల్ 03**

ప్రజల ఆరోగ్య రక్షణే కూటమి ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అందిస్తున్న ముఖ్యమంత్రి సహాయ నిధి ఎందరో ప్రాణాలను నిలబెడుతోందని ప్రభుత్వ విప్ మరియు విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే పి.జి.వి.ఆర్. నాయుడు (గణబాబు) పేర్కొన్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న 10 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం నుండి మంజూరైన సుమారు రూ. 6,70,000/- విలువైన చెక్కులను ఎమ్మెల్యే గణబాబు, అప్పుఫిడీసీ డైరెక్టర్ అంగ ప్రశాంతి, మరియు స్థానిక నాయకులతో కలిసి వారి నివాసాల వద్దే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ పేదలు ఆపదలో ఉన్నప్పుడు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇవ్వడమే మా లక్ష్యం. సీఎంర్ఫ్ నిధులను పారదర్శకంగా, త్వరితగతిన లబ్ధిదారులకు చేరవేస్తున్నాము. ఆపరేషన్లు చేయించుకుని కోలుకుంటున్న వారికి ఈ ఆర్థిక సహాయం ఎంతో ఊతమిస్తుందని అన్నారు.

**లబ్ధిదారుల వివరాలు (వార్డుల వారీగా):**

సొనాపతి చిన్నబాయి (58వ వార్డు) - రూ. 1,46,337/-
సదాని పల్లి నాగమణి (58వ వార్డు) - రూ. 30,028/-
కుసుమూరు ఈశ్వరమ్మ (59వ వార్డు) - రూ. 22,000/-
శంకరన శంకర్ (59వ వార్డు) - రూ. 41,601/-
పాటూరి సత్యవతి (59వ వార్డు) - రూ. 20,000/-
మోటూరి చంద్ర శేఖర్ (59వ వార్డు) - రూ. 95,130/-
కొత్తపల్లి సుమన్ (60వ వార్డు) - రూ. 93,543/-
గంట్యాడ పోలమ్మ (62వ వార్డు) - రూ. 57,978/-
కంబాల చంటి (62వ వార్డు) - రూ. 1,40,000/-
కుర్రి అప్పారావు (62వ వార్డు) - రూ. 43,421/-

తమ కష్టకాలంలో కొండంత అండగా నిలిచిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి, సాయం అందించడంలో చొరవ చూపిన ఎమ్మెల్యే గణబాబు కి లబ్ధిదారులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ పంపిణీ కార్యక్రమంలో స్థానిక వార్డు నాయకులు, జనసేన-టీడీపీ-బీజేపీ కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న ధర్మాజీగూడెం ఎస్సై వెంకన్న





**లింగపాలెం (సిటిజన్ టైమ్స్) ఏప్రిల్ 03**

ఏలూరు జిల్లా లింగపాలెం మండలం ములుగులంపాడు గ్రామంలో ఇటీవలే కొడుకులు సరిగ్గా చూడక ఇంటి బయట చెట్టు కింద నివసిస్తున్న వృద్ధురాలని అని వార్త తెలుసుకొని స్పందించి.. హుటా హుటిన బయలుదేరి ఆ గ్రామానికి చేరుకున్న ఎస్ఐ వెంకన్న వాళ్ళ కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆ వృద్ధురాలని పక్కనే ఉన్న వాళ్ళ మేనమామ ఇంటి దగ్గర పెట్టి ఆ వృద్ధురాలకు త్వరలోనే నివాసం ఏర్పాటు చేయాలని కుమారులకు కౌన్సిలింగ్ ఇచ్చిన.. ఎస్సై వెంకన్న ఇలాంటి ఫ్రెండ్లీ పోలీసు ఉండటంవల్ల ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నామని లింగపాలెం మండలం ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు

## మురముళ్ళ కార్యాలయంలో ప్రజా దర్బార్

**ఐ. పోలవరం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 3**

మురముల్ల టిడిపి కార్యాలయంలో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) పాల్గొని వివిధ సమస్యలతో వచ్చిన అర్జీదారులను కలుసుకున్నాను. వారి సమస్యలను శ్రద్ధగా వినిపించుకొని, వెంటనే పరిష్కరించగలిగిన వాటిని తక్షణమే పరిష్కరించామని, మిగిలిన సమస్యలను సంబంధిత శాఖలకు పంపించి, త్వరితగతిన పరిష్కారం అందేలా కార్యాలయ సిబ్బందికి ఆదేశాలు ఇచ్చానని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారం మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అన్నారు.




## కూటమితోనే మత్స్యకారుల

# అభివృద్ధి సాధ్యం...!

### ఏపీ సాంప్రదాయ మత్స్యకార కులాల సంక్షేమ సంఘాల సమాఖ్య...!

**విశాఖపట్నం, ఏప్రిల్ 3 సిటిజన్ టైమ్స్**

మత్స్యకారుల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఆంధ్రప్రదేశ్ సాంప్రదాయ మత్స్యకార కులాల సంక్షేమ సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు నడుకుదిటి అర్జున, ప్రధాన కార్యదర్శి చింతకాయల ముత్యాలు అన్నారు. డాబాగార్డెన్స్, వీజేఎఫ్ ప్రెస్ క్లబ్ లో శుక్రవారం ఉదయం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో మత్స్యకార సామాజిక వర్గంలో గల 14 ఉప కులాలకు వారి జనాభా ప్రాతిపదికన ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఆయా కులాల అభివృద్ధి, సంక్షేమానికి పాటు పడాల్సిందిగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు విజ్ఞప్తి చేశారు. తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాల మత్స్యకారులు ఆంధ్రప్రదేశ్ సముద్ర జలాలలో అక్రమంగా చేపల వేట చేస్తూ మత్స్య సంపదను అక్రమంగా దోచుకు వెళ్తూ, రాష్ట్ర మత్స్యకారులపై దాడులు చేస్తున్నారన్నారు. ఈ పరిస్థితులలో మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన రాష్ట్ర ఎక్సైజ్ గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, కాకినాడ సిటీ శాసన సభ్యులు వనమాడి వెంకటేశ్వరరావు, మాజీ మంత్రి మోపిదేవి వెంకట రమణరావు, నరసాపురం శాసన సభ్యులు బొమ్మిడి నాయకర్ కలసి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి ఈ విషయం తీసుకువెళ్లారని తెలిపారు. స్పందించిన ముఖ్యమంత్రి రాష్ట్ర సముద్ర జలాల్లో రాష్ట్రానికి చెందిన మత్స్యకారులు మాత్రమే చేపల వేట చేసుకోవాలని నెల్లూరు, తిరుపతి జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. పక్క రాష్ట్రాల మత్స్యకారుల చేపల వేటను ఆపాలని ఉద్దేశంతో గస్తీ బోట్లను మంజూరు చేసి నిరంతరం



సముద్రంలో పటిష్టమైన నిఘా ఏర్పాట్లు చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, సమస్య పరిష్కారానికి కృషి చేసిన మత్స్యకారుల నాయకులకు సమాఖ్య తరుపున కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు అర్జున, ముత్యాలు తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాలలో అధిక సంఖ్యలో ఉన్న వాడ బలిజ కులానికి చెందిన వారికి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, అనకాపల్లి, కాకినాడ పార్లమెంట్ స్థానాలలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎటువంటి నామినేటెడ్ పదవులు ఇవ్వలేదన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్ర వాడబలిజ అభివృద్ధి, సంక్షేమ కార్పోరేషన్, శాసన మండలి ఎన్నికలలో వాడబలిజ మత్స్యకారులకు అవకాశాలు కల్పించాలని కోరారు. అలాగే నెయ్యిల, జాలరి, పట్టపు, కులాలకు కూడా ప్రత్యేక కార్పొరేషన్లు, నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత కల్పించాలన్నారు. సమావేశంలో 14 ఉప కులాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

## అప్పుడు విశాఖ.. ఇప్పుడు మావిగన్..

## బ్రహ్మానందాన్ని తలపిస్తున్న జగన్: గంటా



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రిల్ 3:**

అధికారంలో ఉండగా విశాఖను రాజధానిగా ప్రకటించిన జగన్మోహన్ రెడ్డి ఇప్పుడు మావిగన్ ను రాజధాని చేయాలని యు టర్న్ తీసుకుని విశాఖను వదిలేశారని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు విమర్శించారు. శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజధాని విషయంలో జగన్మోహన్ రెడ్డి మాటలు మారుస్తూ ఊసరవిల్లిని మించిపోయారని పేర్కొన్నారు. అమరావతి రాజధానిగా స్వాగతిస్తున్నామని అసెంబ్లీ సాక్షిగా చెప్పిన జగన్ 2019 లో అధికారంలోకి వచ్చిన తర్వాత విశాఖ పరిపాలన రాజధాని అంటూ మాట మార్చారన్నారు. తాజాగా మచిలీపట్నం - విజయవాడ - గుంటూరు (మావిగన్) ను రాజధాని చేయాలని ప్రతిపాదించారంటే విశాఖ వద్దని పరోక్షంగా చెప్పినట్టేనని పేర్కొన్నారు. ఆల్ ఫూల్స్ డే ఏప్రిల్ 1వ తేదీన మావిగన్ ను రాజధాని చేయాలనడం ఆయన మానసిక స్థితిపై అనుమానం రేకెత్తిస్తోందన్నారు. సినీ నటుడు బ్రహ్మానందం సినిమాలు తగ్గించిన లోటును జగన్మోహన్ రెడ్డి తన కామెడీతో భర్తీ చేస్తున్నారని చెప్పారు. అమరావతి రాజధాని బిల్లు లోక్ సభ, రాజ్య సభలలో దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు ఆమోదించగా.. వైసీపీ మాత్రమే వ్యతిరేకించి చరిత్రహీనంగా మారిందని తెలిపారు. అమరావతిపై మొదటినుంచి జగన్మోహన్ రెడ్డి విషం చిమ్ముతున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రాలకు అసలు రాజధానే అవసరం లేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. విశాఖ ఎయిర్ పోర్టు ఈగలు తోలుతుంటే భోగాపురంలో ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు ఎందుకని.. ఎర్ర బస్సు రాని భోగాపురానికి ఎయిర్ బస్సు ఎందుకని.. ప్రశ్నించిన జగన్ ఆ తర్వాత మాట మార్చి భోగాపురం ఎయిర్ పోర్టు రావడానికి కారణం తానేనని చెప్పుకోవడం ఆత్మవంచనగా వ్యాఖ్యానించారు. ఒరిస్సాలో లక్ష కోట్లతో స్టీల్ ప్లాంటు ఏర్పాటు చేసిన నిప్పాన్ అనకాపల్లి జిల్లాలో ఎందుకు ప్రతిపాదిస్తుందని వెటకారంగా ప్రశ్నించిన జగన్.. ఆ ప్లాంట్ కు శంకుస్థాపన చేయడంతో దావోస్ లో మిట్టల్ తో మాట్లాడి స్టీల్ ప్లాంట్ తీసుకువచ్చింది తానేనని చెప్పుకోవడం దిగజారుడుతనమన్నారు. గూగుల్ డేటా సెంటర్ విషయంలోనూ క్రెడిట్ చోరీకి పాల్పడ్డారని చెప్పారు. కూటమి నాయకులు పంచకర్ల సందీప్, చిక్కాల విజయ్ బాబు, గంటా నూకరాజు, గాడు చిన్ని కుమారి లక్ష్మి, పీవీ నరసింహం, శాఖారి శ్రీనివాస్, లొడగల అప్పారావు, కంటుభుక్త రామానాయుడు, కాళ్ల నగేష్ కుమార్, మొల్లి లక్ష్మణరావు, నాగోతి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## బండారులంక సర్పంచ్‌కు ఘన సన్మానం



**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 3**

మండలం లోని బండారులంక గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ పెనుమాల సునీత దంపతులను గ్రామస్తులు, పంచాయతీ సిబ్బంది గురువారం ఘనంగా సన్మానించారు.గ్రామ టిడిపి అధ్యక్షులు పిచ్చిక శ్యామ్, శ్రీశైల దేవస్థానం మాజీ పాలకవర్గ సభ్యులు చింతా శంకరమూర్తి,యువనాయకుడు కాశిన బాబి ఆధ్వర్యంలో గజమాలతో చిరు సత్కారం చేశారు. సర్పంచ్ పదవీకాలంలో గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం,తాగునీరు, రహదారులు,పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టడం వల్ల గ్రామం అభివృద్ధి దిశగా ముందుకు సాగిందని గ్రామ పెద్దలు ప్రశంసించారు.ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, యువత, మహిళా సంఘాల ప్రతినిధులు కలిసి సర్పంచ్‌ను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేశారు. పలువురు ప్రసంగిస్తూ సర్పంచ్ చేసిన సేవలను కొనియాడారు. గ్రామ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేసిన నాయకురాలు అని పార్టీలకతీతంగా అనేకమంది పాల్గొని అభివర్ణించారు.సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామ ప్రజల సహకారం లేకుండా ఏ అభివృద్ధి సాధ్యంకాదని, అందరి సహకారంతోనే ఈ విజయాలు సాధ్యమయ్యాయని అన్నారు. భవిష్యత్తులో కూడా గ్రామ అభివృద్ధి కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమం లో ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యురాలు పుణ్యమంతుల రజిని,బూత్ కమిటీ అధ్యక్షులు కొండా సత్యనారాయణ రాజు, యువనాయకులు ఈతకోట రాజేష్, మల్లవరపు ఏడుకొండలు,దంగేటి శ్రీరామ్, కరాటం ప్రవీణ్,గంగుమళ్ళ ఏసుబాబు,గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అమరావతి బిల్లు ఆమోదంతో కూటమి నాయకుల సంబరాలు




**అమలాపురం,సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 03**

ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందిన చారిత్రాత్మక సందర్భాన్ని పురస్కరించుకుని గురువారం అమలాపురం పట్టణంలో కూటమి నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున సంబరాలు నిర్వహించారు. స్థానిక శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు ఆదేశాల మేరకు, పట్టణంలోని ప్రధాన కూడలి అయిన గడియార స్తంభం వద్ద కూటమి పార్టీల నాయకులు బాణసంచా కాల్చి, ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుంటూ తమ హర్షాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ, ఆంధ్రుల ఆకాంక్షను నెరవేరుస్తూ ఎన్డీయే కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం చారిత్రాత్మకమని కొనియాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో రాజధాని రైతులకు న్యాయం జరిగిందని, రాష్ట్ర అభివృద్ధికి ఇది పునాది అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల కూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలు స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీ జగన్మోహిని కేశవ స్వామికి విశాఖవాసి 50 వేలు విరాళం







**ఆత్రేయపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 3**

మండలంలోని ర్యాలి గ్రామంలో వేంచేసియున్న శ్రీ జగన్మోహిని కేశవ గోపాల స్వామికి విశాఖపట్నం నకు చెందిన మండ రశ్మి స్నిగ్ధ ,ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ - గోపాల స్వామి వారిని దర్శించుకొని శ్రీ స్వామి వారి ఆలయ అభివృద్ధి కార్యక్రమముల నిమిత్తం రూ.50,116/-లు విరాళంగా సమర్పించియున్నారు. అదేవిధంగా ఒంగోలుకు చెందిన ఎస్ సాయిరాం పదివేల రూపాయలు విరాళం అందజేయగా దాతలకు ఆశీర్వచనం చేయించి, శ్రీ స్వామి వారి శేష వస్త్రంతో ఆలయ అధికారులు అర్చక స్వాములు సత్కరించారు.

# విశాఖ నగరాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్ళడమే లక్ష్యం

### జీవీఎంసీ ఆదాయ పరిపుష్టికి ప్రత్యేక దృష్టి -జిల్లా కలెక్టర్ ,జీవీఎంసీ ప్రత్యేక అధికారి ఎం. అభిషిక్త్ కిషోర్.

### జీవీఎంసీ ఉన్నతాధికారులతో ప్రత్యేక అధికారి సమీక్ష .





**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రిల్ 3:**
విశాఖ నగరాన్ని ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో తీర్చిదిద్దటమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలక్టరు ఎం. అభిషిక్త్ కిషోర్ అన్నారు. శుక్రవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమావేశం లో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, ఇతర జీవీఎంసీ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ముందుగా నూతన విశాఖ జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టి మొదటిసారి జీవీఎంసీ ప్రత్యేక అధికారి హోదాలో జీవీఎంసీ కి విచ్చేసిన జిల్లా కలెక్టర్ ,జీవీఎంసీ ప్రత్యేక అధికారికి జీవీఎంసీ కమిషనర్ తోపాటు అదనపు కమిషనర్లు ఇతర ఉన్నతాధికారులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలక్టర్ మాట్లాడుతూ విశాఖ నగరం పై అంతర్జాతీయ స్థాయిలో చర్చ జరుగుతుందని అందరి దృష్టి విశాఖ పై కేంద్రీకృతమవుతు న్నదని అందుకు మునిసిపల్ యంత్రాంగం అందుకు తగిన విధంగా ప్రణాళికలు రూపొందించి పనిచేయాలని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా అమలవుతున్న అత్యుత్తమ ప్రాజెక్ట్ ను స్ఫూర్తి గా తీసుకొని విశాఖలో నూతన పనులు ప్రారంభించాలని సూచించారు. అధికారులు నిరంతరం క్షేత్ర స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ, సమస్యలు తెలుసుకొని ప్రజాప్రతినిదుల సూచనల మేరకు పనులు చేపట్టాలని కో రారు. ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ పనులు చేపట్టాలన్నారు. జీవీఎంసీ పట్ల ప్రజలకు ఉన్న నమ్మకాన్ని నిలబెట్టేలా సిబ్బంది పనితీరు ఉండాలని పేర్కొన్నారు. వార్డు సేక్రేటేరియట్ సిబ్బంది పై వస్తున్న ఆరోపణలను దృష్టిలో ఉంచుకుని వారిపై కఠినంగా వ్యవహరించాలని అన్నారు. విశాఖను ప్రపంచంలోనే పరిశుభ్రమైన, నివాశయోగ్యమైన నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరు అంకితభావంతో పనిచేయాలని కలక్టర్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ స్థాయికి నగర అభివృద్ధి దిశగా జీవీఎంసీ ఆదాయ పరిపుష్టికి అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. తదుపరి జీవీఎంసీ కమిషనర్ జీవీఎంసీ విభాగాల వారీగా ఉన్నతాధికారుల పేర్లు , విధులు జీవీఎంసీ ప్రత్యేక అధికారికి పరిచయం చేశారు. తదుపరి ప్రత్యేక అధికారి విభాగాల వారీగా సమీక్షిస్తూ జీవీఎంసీ ఆదాయ వ్యయలపై వ్యయ పరిశీలకులు,, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకొని విశాఖ నగర అభివృద్ధి లక్ష్యంగా జిపిఎంసి ఆర్థిక పరిపుష్టికి అధికారులు కృషి చేయాలన్నారు. నగరాన్ని 7 స్టార్ రేటింగ్ కు తీసుకు వెళ్లడా నికి ,మొదటి ర్యాంక్ కు కోసం కృషి చేయాలని ,సాసా కార్యక్రమంలో ప్రభుత్వ తీమ్ ప్రకారం నెలంతా కార్యక్రమాలు నిర్వహించాలని, డ్రైనేజీ లలో మురుగు నిలువ లేకుండా చూడాలని, ప్రజలకు జారీచేసే బర్త్ , డెత్ సర్టిఫికేట్ విషయంలో సర్వీసులు పూర్తి స్థాయిలో డిజిటలైజ్ చేయాలని ,ఇలాంటివి ప్రజల డోర్ స్టెప్ వద్దకు తీసుకు వెళ్లేందుకు ప్రయత్నం చేయాలన్నారు. నగరపాలక సంస్థ ఏర్పాటు చేసే వేసవి చలివెంద్రాలలో సియేస్ఆర్ ఫండ్స్ ద్వారా త్రాగునీటి తో పాటు మజ్జిక, ఓఆర్ఎస్ అందించడానికి కృషి చేయాలని అన్నారు.భోగాపురం ప్రారంభం నాటికి రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలని, ఎక్కడైనా భూ సమస్య ఉంటె జాయింట్ కలక్టర్ తో చర్చించి పరిష్కరించాలన్నారు. తదుపరి ప్రజారోగ్యం పై సమీక్ష నిర్వహిస్తూ నగరంలో పారిశుధ్య నిర్వహణ, క్లాప్ వాహనాలు, పారిశుద్ధ్య కార్మికుల వివరాలు, వ్యర్ధాల సేకరణ, తరలింపు, కాపులుప్పాడ డంపింగ్ యార్డ్ లోని కంపోస్టు తయారీ, విద్యుత్ ప్లాంటు, బయోగ్యాస్ ప్లాంటు, రీసైకిల్ విధానం, తోపాటు వ్యర్థాల నిర్వహణ , మిద్దె తోటల తో పచ్చదనం అభివృద్ధి, ప్రజా మరుగుదొడ్లు, వెటర్నరీ విభాగం, మలేరియా విభాగం, స్వర్ణాంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం మొదలైనవి అడిగి తెలుసుకున్నారు. స్వచ్ఛ సర్వేక్షన్ లో మొదటి ర్యాంకు లక్ష్యంగా అధికారులు ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఇంజనీరింగ్ విభాగం పై సమీక్షిస్తూ నగరంలో రోడ్లు, కాలువలు, ఇతర పబ్లిక్ వర్క్స్ కు కేటాయించిన బడ్జెట్ వాటి వివరాల తో పాటు భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ, పార్కులు, గ్రీన్ బెల్టులు, సెంటర్ మీడియన్ల , పచ్చదనం అభివృద్ధి,నిర్వహణ, పలు ఆధునిక సౌకర్యాలతో కూడిన స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్స్ , స్మార్ట్ సిటీ కార్పోరేషన్ ద్వారా నిర్వహిస్తున్న వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్స్ నిర్మాణం పురోగతి, భోగాపురం ఎయిర్ పోర్టుకు అనుసంధాన రోడ్లు పనుల పురోగతి, పలుచోట్ల చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనులు, జీవీఎంసీ స్టేడియంలు, వీధి దీపాలు, తాగునీరు, మెకానికల్ విభాగం, పట్టణ ప్రణాళిక విభాగం, టిడ్కో ఇల్లు నిర్మాణం, అన్న క్యాంటీన్లు నిర్వహణ, మొదలైనవి జీవీఎంసీ కమిషనర్ ప్రత్యేక అధికారికి వివరించారు. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని చలివేంద్రాలు ఏర్పాటుకు తీసుకున్న చర్యలపై ఆరా తీశారు. విశాఖపట్నం ఎంతో సువిశాలమైన అందమైన నగరమని , నగర ప్రజలు విశాఖ నగర అభివృద్ధికి ఎంతో సహకరిస్తారని తెలిపారు. మహా విశాఖపట్నం నగరపాలక సంస్థరాష్ట్రంలోని పెద్ద కార్పొరేషన్ అని ప్రజలకు కావలసిన అన్ని సర్వీసులు సకాలంలో అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి అదనపు కమిషనర్లు డి.వి. రమణమూర్తి, ఎస్. ఎస్ .వర్మ, పి.నలనయ్య, జాయింట్ డైరెక్టర్ అమృత్ విజయభారతి, ప్రధాన ఇంజనీరు సత్యనారాయణ రాజు, ముఖ్య పట్టణ ప్రణాళిక అధికారి ఏ .ప్రభాకర్ రావు, డిసిఆర్ శ్రీనివాసరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ ఎన్ వి నరేష్ కుమార్, ఇంచార్జ్ డిడిహెచ్ వాసుకి, వ్యయ పరిశీలకులు సి. వాసు దేవ రెడ్డి, ఇంచార్జ్ స్పోర్ట్స్ డైరెక్టర్ ఇ ఎ రాజు, పర్యవేక్షక ఇంజనీర్లు, ప్రణాళిక అధికారులు, జోనల్ కమిషనర్లు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం, కెరీర్ పై ప్రేరణాత్మక ఉపన్యాస కార్యక్రమం



**జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (క లికిరి)ఏప్రిల్ 3. సిటిజన్ టైమ్స్**
పీలేరు నియోజకవర్గంలోని కలికిరి లోని జేఎన్టీయూఏ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం,కెరీర్ మార్గదర్శనం, లక్ష్యసాధనకు దోహదపడే ఉద్దేశంతో ఒక ప్రేరణాత్మక ఉపన్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ కె.వి. ప్రదీప్ కొండిపర్తి ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రపంచం వేగంగా సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్న ఈ కాలంలో విద్యార్థులు కూడా అదే వేగముతో ముందుకు సాగాల్సిన అవసరాన్ని ఆయన వివరించారు. నూతన సాంకేతికతలపై అవగాహన,నైపుణ్యాల అభివృద్ధి సమయ నిర్వహణ మరియు లక్ష్యసాధనపై విలువైన సూచనలు విద్యార్థులకు అందించారు . ఉపన్యాస సందర్భంగా విద్యార్థులు ఆసక్తిగా పాల్గొని ప్రశ్నలు అడిగి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ బృహత్కర కార్యక్రమం విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడంతో పాటు వారి భవిష్యత్తు లక్ష్యాలపై స్పష్టత కల్పించడంలో ముఖ్యపాత్ర పోషించిందని కళాశాల వర్గాలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## చెరువులోని నీరు దిగువకు పోతున్న పట్టించుకోని సంబంధిత అధికారులు

*ముఖ్యమంత్రి చెరువులు నింపమని చెప్తుంటే*

*చెరువులోని నీరు పోతుంటే పట్టించుకునేది ఎవరు*



**చీమలపాడు:( సిటిజన్ టైమ్స్): ఏప్రియల్:03**
ఎన్టీఆర్ జిల్లా, తిరువూరు నియోజకవర్గం, ఏ కొండూరు మండలం, చీమలపాడు గ్రామంలోని పెద్ద చెరువులోని నీరు తూము దగ్గర లాకు పోవటముతో నీరు దిగువక పోతున్నాయి. దీనికి సంబంధించి మండల పరిషత్ కార్యాలయ అధికారికి, నీటిపారుదల శాఖ సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని తెలియజేస్తున్న వైనం.జిల్లా కలెక్టర్ కు కూడా వినతి పత్రం అందజేశారు. గడచిన 30 రోజుల నుంచి చెరువులుని నీరు ఇదే విధముగా దిగువకు పోతుంది. చెరువు ఖాళీ అయ్యే పరిస్థితి కూడా వచ్చింది. తక్షణమే ప్రభుత్వం దృష్టి సారించి చెరువులోని నీరు వృధాగా పోకుండా తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుచున్నారు.

## మానవత్వం చాటుకున్న ధర్మాజీగూడెం ఎస్సై వెంకన్న

**లింగపాలెం (సిటిజన్ టైమ్స్) మార్చి 03**
ఏలూరు జిల్లా లింగపాలెం మండలం ములుగులంపాడు గ్రామంలో ఇటీవలే కొడుకులు సరిగ్గా చూడక ఇంటి బయట చెట్టు కింద నివసిస్తున్న వృద్ధురాలని అని వార్త తెలుసుకొని స్పందించి.. హుటా హుటిన బయలుదేరి ఆ గ్రామానికి చేరుకున్న ఎస్ఐ వెంకన్న వాళ్ళ కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆ వృద్ధురాలని పక్కనే ఉన్న వాళ్ళ మేనమామ గారి ఇంటి దగ్గర పెట్టి ఆ వృద్ధురాలకు త్వరలోనే నివాసం ఏర్పాటు చేయాలని కుమారులకు కౌన్సిలింగ్ ఇచ్చిన.. ఎస్సై వెంకన్న ఇలాంటి ఫ్రెండ్లీ పోలీసు ఉండటంవల్ల ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నామని లింగపాలెం మండలం ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.





## సెమాగ్లూటైడ్ను డాక్టర్ పర్యవేక్షణలోనే వాడాలి

**విశాఖ పట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రిల్ 3**
ఇటీవల మంచి ప్రాచుర్యంలోకి వచ్చిన బరువు నియంత్రిత ఔషధం సెమాగ్లూటైడ్ను నిపుణులైన ఎండోక్రైనాలజిస్ట్ పర్యవేక్షణలోనే వాడాలని నగరంలోని ఎంవిపి కాలని సెక్టార్ 10 అడ్వాన్స్ సెంటర్ ఫర్ ఎండోక్రైనాలజీ అధిపతి డాక్టర్ కె.వి.రవితేజ హెచ్చరించారు. బరువు నియంత్రణలో సమర్ధవంతంగా పని చేస్తున్న ఈ మందు వైద్య నిపుణుల పర్యవేక్షణ లేకుండా విచ్చల విడిగా వినియోగిస్తే శరీరంలో పలు విపరిణామాలకు దారి తీసే ప్రమాదం ఉందన్నారు. ఈ మందు ముఖ్యంగా శరీరంలోని కోట్లాది జీవకణాలపై ఉండే గ్రాహకాలకు బంధించబడి సహజ పదార్థాల మాదిరిగానే పనిచేస్తూ నిర్దిష్ట జీవక్రియను ప్రేరేపించే జిఎల్పి-1వ రకం రసాయన మందన్నారు. అధిక బరువును తగ్గించడంలో ఇది అత్యంత ప్రభావ వంతంగా పనిచేస్తున్నప్పటికీ తగిన జాగ్రత్తలు తీసుకోకుండా వాడితే కొన్ని అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ముఖ్యంగా దీనిని వాడిన తరువాత దీని ప్రభావంతో బరువు వేగంగా తగ్గుతుందని అటువంటి పరిస్థితుల్లో శరీరానికి ప్రోటీన్ల అవసరం ఎక్కువగా ఉంటుందన్నారు. అదే సమయంలో తగినంత శారీరక శ్రమ లేకపోతే జీవక్రియ సంబంధిత అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. బరువు తగ్గడం అనేది ప్రధానంగా శరీరంలో అదనంగా పేరుకున్న క్రొవ్వు నిల్వలను లక్ష్యంగా చేసుకోవాలి కానీ ఆ ప్రయత్నంలో శరీరం కండర క్షీణతకు గురికాకుండా తగిన జాగ్రత్తలు వైద్యుల పర్యవేక్షణలో తీసుకోవాలన్నారు. అందుకే ఈ మందులు అందరికీ ఒకే విధంగా సరిపోక పోవచ్చన్నారు. పాంక్రియాటైటిస్, కొన్ని రకాల జీర్ణ కోశ రుగ్మతలు, మెడుల్లరీ థైరాయిడ్ కార్సినోమా తదితర రుగ్మతలు ఉన్న వారు వీటిని వాడటంలో కఠిన మైన పరిమితులు ఉన్నాయన్నారు. అత్యంత ప్రభావ శీలమైన ఈ మందులు సాధారణ ఆరోగ్య మందుల వలె మందుల షాపుల్లో దొరికేవి కావన్నారు. వీటి వినియోగదారుల ఆరోగ్య పరిస్థితులను నిపుణులైన ఎండోక్రైనాలజిస్ట్ ల సమగ్ర మూల్యాంకనం అవసర మన్నారు. ఎంవిపి కాలని సెక్టార్ 10లో ఉన్న తమ అడ్వాన్స్ సెంటర్ ఫర్ ఎండోక్రైనాలజీ(ఎసిఇ) లో రోగులకు వ్యక్తిగతీకరించిన ఆహార ప్రణాళిక, వ్యాయామ మార్గదర్శకత్వం, నిరంతర పర్యవేక్షణ తదితర జాగ్రత్తలు తీసుకుని వైద్యం అందిస్తా మన్నారు. దీని వల్ల తమ వద్దకు వచ్చే రోగులకు ఆరోగ్యకరమైన రీతిలో బరువు తగ్గడమే కాకుండా స్థిరమైన జీవక్రియ ఫలితాలు కూడా వస్తాయన్నారు.



## తణుకువాడ గ్రామ కమిటీ ప్రమాణ స్వీకారం



**కాకినాడ జిల్లా, కాజులూరు మండలం, గొల్లపాలెం, సిటిజన్ టైమ్స్ ఏప్రియల్ 3:**
కాజులూరు మండలం తణుకువాడ గ్రామకమిటీ ప్రమాణ స్వీకారోత్సవం ఈ రోజు మండల పార్టీ అధ్యక్షుల చేతుల మీదుగా జరిగింది. ఈ కార్యక్రమంలో తణుకువాడ గ్రామ కమిటీ అధ్యక్షునిగా వనుం బాలకృష్ణ ఉపాధ్యక్షునిగా చెల్లుబోయిన అప్పారావు ప్రధాన కార్యదర్శిగా కాళా శ్రీను, మరియు కమిటీ సభ్యులు అందరు ప్రమాణ స్వీకారం చేసారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్షులు చావ్వకుల డాక్టర్ బాబు , క్లస్టర్ ఇంచార్జ్ పలివెల రాజు , మార్కెట్ కమిటీ డైరెక్టర్ వల్లు అర్జున్ రావు సొసైటీ అధ్యక్షులు పితాని సతీష్ కుమార్ గ్రామంలోని కూటమి కార్యకర్తలు పెద్దలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా తణుకువాడ, గ్రామ ప్రజలు శుభాకాంక్షలు తెలియజేశారు.

## దప్పు కొట్టే వ్యక్తిపై చేయి చేసుకున్న అయ్యన్నపాత్రుడు

### *బహిరంగంగా కొట్టడం అమానుషమని మండిపడుతున్న వైసీపీ*

### *స్పీకర్ అయ్యన్న అందుకే కొట్టారు - రాందాసు వివరణ*

**సిటిజన్ టైమ్స్ నర్సీపట్నం ఏప్రియల్ :03**
ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ మరియు నర్సీపట్నం ఎమ్మెల్యే చింతకాయల అయ్యన్న పాత్రుడు వివాదంలో చిక్కుకున్నారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో నిర్వహించిన ఒక బహిరంగ కార్యక్రమంలో దళిత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిపై ఆయన చేయి చేసుకున్న ఘటన ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. నర్సీపట్నం లో జరిగిన స్థానిక పండుగ సంబరాలు వేడుకల్లో భాగంగా భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాందాసు అనే దళిత వ్యక్తి ఉత్సాహంగా డప్పు కొడుతుండగా, సమీపంలో ఉన్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఒక్కసారిగా సహనం కోల్పోయారు. అందరూ చూస్తుండగానే రాందాసు ను తిడుతూ, చెంపదెబ్బ కొట్టినట్లు వీడియో దృశ్యాల్లో కనిపిస్తోంది. రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిలో ఉండి, చుట్టూ పోలీసులు మరియు ప్రజలు ఉన్నా లెక్కచేయకుండా ఆయన ప్రవర్తించిన తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ప్రధాన ప్రతిపక్షం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది.ఒక దళితుడిపై ఇలా బహిరంగంగా కొట్టడం అమానుషమని, స్పీకర్ పదవికి ఇది అవమానకరమని వైసీపీ మండిపడింది.నైతిక బాధ్యత వహిస్తూ ఆయన తన పదవికి తక్షణమే రాజీనామా చేయాలని విపక్ష నేతలు సోషల్ మీడియా వేదికగా డిమాండ్ చేస్తున్నారు.





**అయ్యన్న ఎందుకు తనని కొట్టాల్సి వచ్చిందో తెలిపిన రాందాసు..:**
ఇది ఇలా ఉంటే బాధితుడు రాందాసు స్వయంగా వివరణ ముందుకు వచ్చి ఈ విధంగా వివరణ ఇవ్వడం జరిగింది. నాగులపల్లి రాందాసు మాట్లాడుతూ, ఘటన జరిగిన సమయంలో తాను మద్యం మత్తులో ఉన్నానని ఒప్పుకున్నారు. ఆ సమయంలో అనుకోకుండా అయ్యన్నపాత్రుడు కాలి మీద తాను తొక్కడం జరిగిందని, దాంతో ఆయనకు కోపం వచ్చి కొట్టారని తెలిపారు. ఈ సంఘటనను రాజకీయంగా మలచడం తగదని అభిప్రాయపడ్డారు. అతను ఇంకా వివరించి మాట్లాడుతూ, చిన్నప్పటి నుంచే తాను అయ్యన్నపాత్రుడు కుటుంబంతో సన్నిహితంగా ఉంటున్నానని, వారిని తన కుటుంబ సభ్యుల్లా భావిస్తున్నానని చెప్పారు. ఈ నేపథ్యంలో జరిగిన చిన్న సంఘటనను పెద్దదిగా చేసి, రాజకీయ రంగు పులమడం సరైనది కాదన్నారు. ఇటీవల నిర్వహించిన జాతరను అయ్యన్నపాత్రుడు ఎంతో ఘనంగా నిర్వహించారని రామదాసు ప్రశంసించారు. ప్రజల కోసం కృషి చేస్తున్న నాయకుడిపై అనవసర ఆరోపణలు చేయడం సమంజసం కాదని ఆయన పేర్కొన్నారు.

## రాజముద్రతో నూతన పట్టాదారు పాసుపుస్తకాల పంపిణి

**ముమ్మిడివరం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 3**
కూటమి ప్రభుత్వం చేపట్టిన రీ-సర్వే కార్యక్రమం లో భాగంగా రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాల పంపిణి కార్యక్రమం ఈరోజు ముమ్మిడివరం నియోజకవర్గంలోని అన్నంపల్లి గ్రామంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి గౌరవ ప్రభుత్వ విప్ ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు హాజరై లబ్ధిదారులకు పట్టాదారు పాసుపుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా సుమారు 315 మంది లబ్ధిదారులకు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా శాసనసభ్యుల వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రీసర్వే తప్పులు తడకగా జరుగుతుందని, కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన వెంటనే రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని, అందులో భాగంగా రీ సర్వే చేపట్టి రాజ ముద్రతో కూడినటువంటి పట్టాదారు పాస్ పుస్తకాలు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుత్తుల సాయి పాల్గొన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామ ప్రజలు, మీడియా మిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# ఏలేరు జలాశయాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్..

## రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి..









**కాకినాడ /ఏలేశ్వరం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 3**

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల ప్రకారం కాకినాడ జిల్లాను అన్ని విధాల అభివృద్ధి పథంలో నడిపించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం ఏలేశ్వరంలోని ఏలేరు జలాశయాన్ని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్.. సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. జలాశయంలోని ప్రస్తుత నీటి సామర్థ్యం, ఏలేరు జలాశయం నుంచి తాగునీటి సరఫరా, పోలవరం ఎల్ఎంసి ద్వారా వచ్చే నీళ్లు, పంటకు దిగువకు విడుదల చేస్తున్న నీరు, రోజువారి మెయింటినెన్స్ వంటి వివరాలను ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి వివరంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడ ఉన్న పవర్ హౌస్ ను పరిశీలించి, పని తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏలేరు జలాశయానికి వెళ్లే రహదారికి ఇరువైపులా ఉపాధి హామీ పని ద్వారా శుభ్రం చేయించాలని జిల్లా కలెక్టర్.. ఎంపీడీవోకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ.. కాకినాడ జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన తరువాత తొలిసారిగా క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా నేడు ఏలేరు జలాశయాన్ని పరిశీలించడం జరిగిందన్నారు. ఏలేరు జలాశయం నీటి సామర్థ్యం, తాగునీటి సరఫరా, పోలవరం ఎల్ఎంసీ ద్వారా వస్తున్న నీటి వివరాలు, దిగువకు విడుదల చేస్తున్న సాగునీటి వివరాలను స్థానిక ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకోవడం జరిగిందన్నారు.ప్రతియేటా దిగువకు 60 వేల హెక్టార్లకు అవసరమైన నీటిని విడుదల చేయడం జరుగుతుందని రోజువారి మైఇంటినెన్స్ కు సంబంధించి ఇంజనీరింగ్ అధికారులకు తన దృష్టికి తీసుకొచ్చిన అంశాలకు సంబంధించి చర్యలకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుంది ఆయన తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లాను అభివృద్ధి దశగా నడిపించే చర్యలో భాగంగా నేడు క్షేత్రస్థాయి పరిశీలన చేసినట్లు ఆయన వివరించారు. ఈ పరిశీలనలో జిల్లా కలెక్టర్ వెంట ఏలేశ్వరం తహసీల్దార్ కె.కుసరాజు, ఎంపీడీవో వర్మ; ఏలేరు జలాశయం ఈఈ కాశీ వెంకటేశ్వరరావు, డీఈలు డి. శ్యాంప్రసాద్, తమ్మయనాయుడు, వర్క్ ఇన్స్పెక్టర్ జి నాగ వెంకటేశ్వరరావు ఇతర అధికారి తదితరులు పాల్గొన్నారు.

# 74.20 కోట్లతో లొల్ల లాకులు ఆధునీకరణ...

### నిధుల మంజూరు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , యువ నాయకుడు లోకేష్ బాబు కి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కృతజ్ఞతలు

**కొత్తపేట సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 3**



నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామా నాయుడు ని స్వయంగా కలిసి ప్రత్యేకంగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కృతజ్ఞతలు తెలిపారు. దశాబ్దాల కల... కోనసీమ ప్రాంత ప్రజలు ఎదురుచూస్తున్న లొల్ల లాకులు ఆధునీకరణకు ప్రభుత్వం ఎట్టకేలకు నిధులు మంజూరు చేసింది. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు నాలుగోసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుండి లొల్ల లాకులు ఆధునికరంపై ప్రత్యేక దృష్టి పెట్టారు...ఇందుకు ప్రభుత్వం సహకరించింది.. నిధులు మంజూరు చేసింది. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం, జలవనరుల శాఖ – గోదావరి సెంట్రల్ డెల్టా వ్యవస్థ ఆధునీకరణ -- ఆత్రేయపురం గ్రామం సమీపంలోని జీసీ ప్రధాన కాలువ 13.200 వద్ద ఉన్న లొల్ల ,రాలి వేర్, లాక్స్, ఇప్పటికే ఉన్న లాక్స్, వేర్లు, వంతెనల దిగువ భాగం డిఎల్ఆర్బి పునర్నిర్మాణానికి పరిపాలనా అనుమతి మంజూరు చేసింది.. జలవనరుల (ప్రాజెక్టులు) శాఖ,జి.ఓ.ఆర్.టి. నెం.175 డిఎల్ ఆర్ బి పునర్నిర్మాణానికి రూ.77.40 కోట్లు (అంచనా) వ్యయంతో పరిపాలనా అనుమతి మంజూరు చేయాలని ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు చేసిన ప్రతి పాదనను ప్రభుత్వం జాగ్రత్తగా పరిశీలించి రూ.74.20 కోట్లు పరిపాలనా అనుమతి మంజూరు చేస్తోంది. లొల్ల లాకులు నుండి మూడు పంట కాలువలు పునర్నిర్మాణం ద్వారా రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించడంతోపాటు పల్లంకురు వద్ద బ్రిడ్జి నిర్మాణానికి నిధులు వినియోగించనున్నారు. అమలాపురం పార్లమెంట్ పరిధిలోని కోనసీమ ప్రాంతంలో గల ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన రైతులకు మేలు జరగనుంది.

# బాధితునికి వైసిపి నేత రమణారావు ఆర్థిక సాయం

**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 3**

పాలగుమ్మి పంచాయతీ కంభంపాడు బిసి కాలనీకు చెందిన కముజు మంగాదేవి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుంది. విషయం తెలుసుకున్న అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైసిపి సీనియర్ నాయకుడు, గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు మంగాదేవి చికిత్స ఆమె భర్త కముజు సత్యనారాయణకు శుక్రవారం ఆర్థిక సాయం అందించిత్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సాయం అందించిన రమణారావు కు మంగాదేవి ఆమె భర్త సత్యనారాయణ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఉపసర్పంచ్ కాట్రు వసంత కుమార్, కాట్రు తాతారావు, ఈదరపల్లి మాజీ సర్పంచ్ నక్కా సంపత్ కుమార్, నేరేడుమిల్లి శ్రీను,పరమట రాజశేఖర్,బొంతు రామకృష్ణ,గుడ్ సీడ్ ఫౌండేషన్ సభ్యులు పరమట రాజేష్, విప్పర్తి రమేష్, దాసరి అంజి,ముత్తాబత్తుల గణేష్ తదితరులు పాల్గొన్నారు.




# అమరావతి ఏకైక రాజధాని గా చట్టబద్ధతపై సీఎం ని అభినందించిన పల్లా

**అమరావతి, సిటిజన్ టైమ్స్, ఏప్రిల్ 03:**



మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయానికి విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఘనంగా స్వాగతం పలికి, అమరావతిని ఆంధ్రప్రదేశ్‌కు ఏకైక రాజధానిగా స్థిరపరచడంపై హృదయపూర్వక అభినందనలు తెలిపారు. పార్టీ శ్రేణులు "జై అమరావతి" నినాదాలతో కార్యాలయం మార్మోగింది. ఈ సందర్భంగా నిర్వహించిన క్లస్టర్ ఇంఛార్జి శిక్షణ తరగతుల ముగింపు సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం లభించడం రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు న్యాయం చేసిన చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. అమరావతి కేవలం రాజధాని మాత్రమే కాకుండా, ఐదుకోట్ల ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిందన్నారు. అదేవిధంగా, రాష్ట్ర ప్రజలంతా ఈ నిర్ణయాన్ని పండుగలా జరుపుకుంటున్నారని పల్లా తెలిపారు. ప్రతి ఇంట్లో దీపాలు వెలిగిస్తూ అమరావతికి చట్టబద్ధత లభించినందుకు హర్షం వ్యక్తం చేస్తున్నారని, ఇది ప్రజల ఆనందానికి ప్రతిబింబమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, అపార అనుభవం, అభివృద్ధి పట్ల అంకితభావం వల్లే అమరావతి నేడు శాశ్వత రాజధానిగా స్థిరపడిందని పల్లా గారు కొనియాడారు. క్లిష్ట పరిస్థితుల్లోనూ రాజధాని అంశంపై వెనుకడుగు వేయకుండా, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా నిరంతరం కృషి చేసిన నాయకత్వం చంద్రబాబు దేనని అన్నారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తీసుకున్న ఈ నిర్ణయం తరతరాలకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. రైతుల త్యాగాలు, ప్రజల దీర్ఘకాలిక పోరాటం ఫలితంగా ఈ రోజు సాధ్యమైందని తెలిపారు. రాష్ట్ర భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసే విధంగా అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. గత వైసీపీ పాలనలో మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని గందరగోళంలోకి నెట్టారని పల్లా తీవ్రంగా విమర్శించారు. అభివృద్ధిని అడ్డుకునే విధంగా తీసుకున్న ఆ నిర్ణయాలు ప్రజల్లో అయోమయం సృష్టించాయని పేర్కొన్నారు. ఇప్పుడు అమరావతిని ఏకైక రాజధానిగా స్పష్టత రావడంతో అన్ని అనుమానాలకు తెరపడిందన్నారు. అమరావతి నిర్మాణంపై ఇంకా గందరగోళ వ్యాఖ్యలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు చేయడం సరైంది కాదని పల్లా హెచ్చరించారు. రాష్ట్ర అభివృద్ధికి అడ్డంకులు సృష్టించే రాజకీయాలకు ప్రజలు తగిన సమాధానం ఇస్తారని అన్నారు. అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా తీర్చిదిద్దే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, రాష్ట్ర అభివృద్ధికి ఇది కీలక మైలురాయిగా నిలుస్తుందని పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు.

# లొల్లలాకుల పునరుద్ధరణకు రూ.74.20 కోట్లు

### – 5 నియోజకవర్గాల రైతులకు వరం

### ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ ను అభినందించిన మంత్రి వాసంశెట్టి సుభాష్



**రావులపాలెం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 3**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని ఐదు నియోజకవర్గాల రైతులకు లొల్లలాకుల పునరుద్ధరణకు ?74 కోట్ల 20 లక్షల నిధులు మంజూరు కావడం శుభపరిణామమని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. రావులపాలెం క్యాంప్ కార్యాలయానికి చేరుకున్న ఆయనకు స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఈ సందర్భంగా కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ క్యాంప్ కార్యాలయానికి చేరుకుని ఎమ్మెల్యే బండారును అభినందించారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ ఎమ్మెల్యే బండారును సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ, లొల్లలాకుల ప్రాజెక్ట్ ఐదు నియోజకవర్గాల పరిధిలోని రైతులకు ఎంతో ఉపయోగకరమని అన్నారు. ఈ ప్రాజెక్ట్ సాధనలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఎల్లలేని కృషి చేశారని ప్రశంసిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.రాష్ట్రంలో గత 20 నెలలుగా అభివృద్ధి కార్యక్రమాలు సజావుగా కొనసాగుతున్నాయని, రాబోయే రోజుల్లో ఎన్డీఏ కూటమి నాయకత్వంలో మరిన్ని మంచి కార్యక్రమాలు చేపట్టనున్నామని తెలిపారు. ఇటీవల పార్లమెంటు రాజ్యసభలో అమరావతిని ఆంధ్రప్రదేశ్ రాజధానిగా ఆమోదించడం జరిగిందని, దీనిని ఓర్వలేక మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు.నియోజకవర్గంలో ఎమ్మెల్యే బండారు చేపడుతున్న అభివృద్ధి పనులను మంత్రి కొనియాడారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఓటమి నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

## వైభవంగా గోవిందుని శ్రీ పుష్ప ఉత్సవం



**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 3**

పట్టణంలోని వేంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవంలో భాగంగా శ్రీ పుష్ప ఉత్సవం వైభవ్ జరిగింది.స్వామివారిని అమ్మవారిని మల్లెపూలు వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. పలు రకాల స్వీట్స్ ను స్వామి ముందు ఉంచారు. రేపాక సత్యనారాయణ మూర్తి దంపతులు ఈ పుష్పయాగ ఉత్సవాన్ని జరిపారు.భక్తులు ఈ ఉత్సవానికి భారీగా హాజరయ్యారు.ఆలయ చైర్మన్ కంచిపల్లి అబ్బులు, ఈవో, సత్యకుమార్ ల ఆధ్వర్యంలో అత్యంత వైభవం గా సాగిన ఉత్సవంలో తిక్కిరెడ్డి సురేష్ దంపతులు స్వామివారి కైంకర్యాలను నిర్వహించారు. కోలాటం, భజన భక్తులను ఆకట్టుకుంది.

## పేదల సంక్షేమమే – ప్రభుత్వ లక్ష్యం

**పేదల జీవితాల్లో వెలుగులు నింపడం ప్రభుత్వ ప్రధాన ధ్యేయం. ప్రతి కుటుంబం సంతోషంగా ఉండేలా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం**

**సేవా సంస్థలు ప్రభుత్వానికి తోడ్పాటుగా నిలిచి సమాజంలో మార్పు తీసుకురావడం చాలా ఆనందకరం. ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తరించాలి."**

**పేదలకు గృహ నిర్మాణం వంటి కార్యక్రమాలు వారికి స్థిరమైన భవిష్యత్తును అందిస్తాయి**

**– మంత్రి వాసంశెట్టి సుభాష్**





**కాకినాడ జిల్లా, కాజులూరు మండలం, జగనధగిరి, ఏప్రిల్ 03**

కాజులూరు మండలం జగన్నాధగిరి లో పేద ప్రజలకు చేయూతగా, అనాధలకు రక్షకంగా నిలుస్తున్న సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ సేవలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. పి-4 కార్యక్రమంలో భాగంగా "మార్గదర్శి బంగారు కుటుంబం"లో భాగంగా ఒక పేద కుటుంబానికి నూతన గృహ నిర్మాణానికి ఫౌండేషన్ అందించిన సహాయం ప్రశంసనీయమని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్మించిన నూతన గృహం గృహప్రవేశ కార్యక్రమానికి మంత్రి హాజరై కుటుంబ సభ్యులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని, నారా లోకేష్ మరియు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో సంక్షేమ కార్యక్రమాలు మరింత వేగవంతంగా అమలవుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కాజులూరు ఎంపీడీవో రాంబాబు ,జనసేన నాయకురాలు నల్లా వసంత హరిణి ,పి. రాజా, తెలుగుదేశం పార్టీ నాయకులు ధవులూరు సురేష్ , యల్లా సత్తిబాబు, అమ్మలకంటి సత్తిబాబు, జనసేన నాయకులు అన్యం శ్రీరామ్, చిక్కాల దొరబాబు, బోండా వెంకన్న, చవాకుల నారాయణమూర్తి, గొప్పన లక్ష్మి, బీజేపీ ఇన్‌చార్జ్ దూడ లక్ష్మీనారాయణ, కొండమూలి సత్యనారాయణ, సంపతి సత్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు

# శ్రీ వీరేశ్వర స్వామి ఆలయ స్థల పరిశీలన

**ఐ పోలవరం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 3**

మురమళ్ల: నిత్య కల్యాణం పచ్చతోరణం గా విరాజిల్లుతున్న మురమళ్ల శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరేశ్వర స్వామి వారి ఆలయ పునః నిర్మాణానికి సంబంధించి స్థలాన్ని దేవాదాయశాఖ అధికారులు శుక్రవారం పరిశీలించారు. స్థానిక శాసన సభ్యులు ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు చొరవతో పునః నిర్మాణం చేపడుతున్న విషయం తెలిసిందే..ఇందుకు సంబంధించి మార్చి 20 న జీర్ణోదరణ కార్యక్రమం జరిపి ఆలయ మండపాలను తొలగించారు.డిప్యూటీ ఇంజినీర్ ఉదయ్ కుమార్, చైర్మన్ దాట్ల రామకృష్ణం రాజు, అసిస్టెంట్ కమీషనర్ వి. సత్యనారాయణ, అర్చకులు బ్రహ్మశ్రీ యనమండ్ర సత్య సీతారామ శర్మ తో కలిసి స్థలాన్ని పరిశీలించి మార్కింగ్ చేశారు.



# విద్యుత్ షాక్‌తో పెయింటర్ మృతి



**పొదిలి, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 3**

విద్యుత్ షాక్ కు గురై ఒక పెయింటర్ మృతి చెందిన సంఘటన పొదిలి లో జరిగింది. శుక్రవారం నాడు స్థానిక మండల రెవెన్యూ కార్యాలయ వీధిలో ఒక నూతన గృహానికి పెయింట్ పనులు చేస్తూ, విద్యుత్ ఘాతానికి గురి అయి బూచిరాజు నాగరాజు అనే వ్యక్తి దుర్మరణం చెందారు. మరణించిన నాగరాజు స్థానిక రజక వీధికి చెందినవారు. పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అతని అకాల మరణంతో నాగరాజు కుటుంబం దిక్కులేనిదిగా మారింది. ఈ సంఘటనపై పొదిలి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

## అమరావతికి చట్టబద్ధత పట్ల బెల్లంకొండ కళాశాలలో సంబరాలు





**పొదిలి , సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 3**

రాష్ట్ర రాజధాని అమరావతికి చట్టబద్ధత కలిగినందుకు స్థానిక బెల్లంకొండ డిగ్రీ కళాశాలలో సంబరాలు జరుపుకున్నారు. శుక్రవారం నాడు పట్టణంలోని బెల్లంకొండ డిగ్రీ కళాశాలలో జరిగిన సంబరాలు అంబరాన్ని అంటాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమర్థుడిగా, కార్యదీక్షపరుడిగా అభివర్ణించారు. అమరావతిని రాజధానిగా చట్టబద్ధత కలిగించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు కళాశా ల మద్దుల శ్రీనివాసరావు, బెల్లంకొండ విద్యాసంస్థల అధినేతలు డాక్టర్ బెల్లంకొండ శ్రీనివాసరావు, బెల్లంకొండ విజయలక్ష్మి తదితరులు తమ అభినందనలు తెలియజేశారు.

## అమరావతి రాజధానిగా చట్టబద్ధత పట్ల బిజెపి నాయకుల సంబరాలు

**పొదిలి, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 3**

రాష్ట్ర రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించడం పట్ల పొదిలిలో బిజెపి నాయకులు సంబరాలు జరుపుకున్నారు. శుక్రవారం నా డు బిజెపి నాయకులు పలువురు మాట్లాడుతూ అమరావతి రాజధాని చట్టబద్ధత కోసం భారత ప్రధాని నరేంద్ర మోడీ గట్టి కృషి చేయడం జరిగిందన్నారు. పార్లమెంటులో ఈ మేరకు చట్టబద్ధత కల్పించేందుకు నరేంద్ర మోడీ చేసిన కృషి ఎంతో ప్రశంసనీయమని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి మహిళా మోర్చా కార్యదర్శి, బెల్లంకొండ విద్యాసంస్థల అధినేత బెల్లంకొండ విజయలక్ష్మి, మండల బిజెపి అధ్యక్షులు డి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# షరీఫ్‌కు సలాం

## -రాష్ట్ర చరిత్రలో సువర్ణ అధ్యాయం

## - నియోజకవర్గ ఐ-టిడిపి అధ్యక్షుడు షేక్ మున్నా





**కందుకూరు, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 3**

రాష్ట్ర రాజకీయాల్లో నిజాయితీ,ధర్మం, ప్రజాస్వామ్య విలువలకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన మాజి శాసనమండలి చైర్మన్ ఎంఏ షరీఫ్.ఒత్తిడులు, బెదిరింపులు ఉన్నా కూడా నాడు మూడు రాజధానుల వికృత క్రీడను కౌన్సిల్ లో చైర్మన్ షరీఫ్ అడ్డుకొనకపోయివుంటే నేటి పరిస్థితులు మరో రకంగా ఉండేది అని నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు షేక్ మున్న అన్నారు. శాసనమండలి చైర్మన్ గా ఆయన వెనుకడుగు వేయకుండా ధర్మం వైపు నిలబడటం ప్రతి ప్రజాప్రతినిధికి ఆదర్శం.నాడు శాసనమండలిలో చైర్మన్ ఉన్న షరీఫ్ పై వైసీపీ ప్రజా ప్రతినిధులు వ్యక్తిగతంగా దాడులు చేయడం, అవమానకర వ్యాఖ్యలు చేయడం పూర్తిగా ఖండనీయమైనది అని అన్నారు. గతంలో శాసనమండలి వేదికగా తాను ఎదుర్కొన్న చేదు అనుభవాలను గుర్తు చేసుకుంటూ నిన్న మాజీ శాసనమండలి చైర్మన్ ఎం.ఏ. షరీఫ్ భావోద్వేగానికి గురికావడం ముస్లిం సమాజంతో పాటు రాజకీయ వర్గాలను తీవ్రంగా కలిచివేసింది అని అన్నారు.ఇలాంటి ప్రవర్తనకు ఆంధ్ర రాష్ట్ర ప్రజలు వైసీపీకి 2024 లో తగిన సమాధానం చెప్పారు,రాబోయే కాలంలో కూడా మూల్యం చెల్లించక తప్పదు అని అన్నారు. గతంలోఆంధ్రప్రదేశ్ కు ఏకైక రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ ఉభయసభలు ఆమోదించటం రాష్ట్ర చరిత్రలో సువర్ణ అధ్యాయమని,పార్లమెంట్ లో అమరావతికి చట్టబద్ధత బిల్లుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు నియోజకవర్గ ఐటిడిపి అధ్యక్షుడు షేక్ మున్న అన్నారు. నవ్యాంధ్రకు సమానమైన మహానగరాన్ని నిర్మించుకునే ఆవశ్యకతను గుర్తించి చంద్రబాబు అమరావతి రాజధాని నిర్మాణం చేపట్టారన్నారు. మొన్నటి వరకు మూడు ముక్కలాడిన వైయస్ జగన్ ఇప్పుడు ప్లాన్ బి అంటూ మరో కుట్ర పన్నుతున్నారని మున్న ఆరోపించారు.

# భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే వేడుకలు

## శిలువ మోసిన టీడీపీ నాయకులు ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డి



**గిద్దలూరు, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 3**

గిద్దలూరు పట్టణంలో గుడ్ ఫ్రైడే వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగాయి. సమస్త జనుల కోసం యేసుక్రీస్తు చేసిన ప్రాణత్యాగాన్ని స్మరిస్తూ పట్టణంలోని క్లబ్ రోడ్డులో గల తిరుకుటుంబ ప్రార్థన ఆలయం ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు, శిలువ యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గిద్దలూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ప్రముఖ నాయకులు ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ వేడుకల్లో భాగంగా నిర్వహించిన భారీ సిలువ యాత్రలో కృష్ణ కిషోర్ రెడ్డి ప్రత్యక్షంగా పాల్గొన్నారు. పట్టణంలోని కుమ్మరాంకట్ట సెంటర్ నుండి రైల్వే స్టేషన్ వరకు సాగిన ఈ యాత్రలో ఆయన స్వయంగా యేసుక్రీస్తు శిలువను తన భుజంపై మోసి నడిచారు. క్రీస్తు అనుభవించిన కష్టాలను, ఆయన చూపిన త్యాగ నిరతిని గుర్తుచేసుకుంటూ భక్తితత్పరతతో ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డి మాట్లాడుతూ.. మానవాళి పాప పరిహారం కోసం సిలువపై ప్రాణత్యాగం చేసిన గొప్ప దైవం యేసుక్రీస్తు అని కొనియాడారు. క్రీస్తు చూపిన ప్రేమ, కరుణ, క్షమాగుణం ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం క్రైస్తవ సోదరసోదరీమణులందరికీ గుడ్ ఫ్రైడే శుభాకాంక్షలు తెలియజేస్తూ, క్రీస్తు ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తిరుకుటుంబ ప్రార్థన ఆలయ నిర్వాహకులు, దైవజనులు, క్రైస్తవ భక్తులు, మహిళలు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారుల నియామకం

## ప్రతి గ్రామానికి ప్రత్యేక అధికారి... సేవలు వేగవంతం

### ఎంపిడిఓ ఈశ్వరమ్మ



**కొనకనమిట్ల, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 3**

కొనకనమిట్ల మండలంలోని గ్రామ పంచాయతీల్లో సర్పంచుల పదవీకాలం ముగియడంతో పరిపాలనలో అంతరాయం కలగకుండా ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించినట్లు ఎంపీడీవో ఈశ్వరమ్మ తెలియచేసారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు నిరంతరంగా కొనసాగడం, ప్రజా సమస్యలకు త్వరితగతిన పరిష్కారం అందించడం లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.ఈ మేరకు చిన్నారికట్ల, పెద్దారికట్ల, సిద్ధవరం గ్రామాలకు తహశీల్దార్ ఆవుల సురేష్‌ను నియమించగా, చింతగుంట, ఎదురాళ్ల పాడు,నాగరాజు కుంట,తువ్వపాడు గ్రామాలకు ఎంపీడీవో ఈశ్వరమ్మ బాధ్యతలు స్వీకరించారు. కొనకనమిట్ల, కాట్రగుంట, రేగుమానిపల్లి, నాగిరెడ్డిపల్లి గ్రామాలకు డిప్యూటీ ఎంపీడీవో శ్రీదేవిని నియమించారు. అలాగే గనివినిపాడు,వాగుమడుగు,వద్దిమడుగు గ్రామాలకు డిప్యూటీ తహశీల్దార్ అరుణను నియమించగా, నాగంపల్లి, సలనూతల, వింజవర్తిపాడు గ్రామాలకు వ్యవసాయ అధికారి ప్రకాష్ రావును నియమించారు.బచ్చలకూరపాడు,గరిమిన పెంట,ఇరసలగుండం గ్రామాలకు విద్యాశాఖ అధికారి నరసింహరావు-2ను నియమించారు. గొట్లగట్టు,చినమనగుండం,గార్లదిన్నె గ్రామాలకు వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి,మంగాపురం,మునగపాడు,వెలిగండ్ల గ్రామాలకు పశు వైద్యశాఖ అధికారి కృష్ణమోహన్‌ను ప్రత్యేక అధికారులుగా నియమించారు. ఈ ప్రత్యేక అధికారులు గ్రామాల్లో శుభ్రత,తాగునీరు,రహదారులు,విద్య, ఆరోగ్యం,వ్యవసాయం వంటి కీలక అంశాలపై దృష్టి సారించి సేవలు అందించాల్సి ఉంటుందని తెలిపారు.అలాగే ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేయడం,ప్రజల ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరించడం,స్థానిక సమస్యలను తక్షణమే స్పందించి పరిష్కరించడం వంటి బాధ్యతలు ఈ ప్రత్యేక అధికారులపై ఉంటాయని ఎంపీడీవో ఈశ్వరమ్మ స్పష్టం చేశారు.

# జగనన్నను ముఖ్యమంత్రి చేసుకోవడమే అంతిమ లక్ష్యం

## 175 నియోజకవర్గాలలో యాత్ర చేయడమే అభిలాష



**మార్కాపురం, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 3**

వైసిపి అధినేత,మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని తిరిగి మరల ముఖ్యమంత్రి చేసుకోవడమే తమ అంతిమ లక్ష్యమని వైసిపి అభిమాని అడవికొట్టు రాజు తెలిపారు.. నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గం జలదంకి మండలం అన్నవరానికి చెందిన రాజు తన గ్రామం నుండి చేపట్టిన బైక్ యాత్ర ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలు చుట్టుముట్టి సోమవారం మార్కాపురం నియోజకవర్గానికి చేరింది.ఈ నేపధ్యంలో మాజీ ఎమ్మెల్యే, నెల్లూరు పార్లమెంటు పరిశీలకులు జంకె వెంకటరెడ్డిని కలసి తన లక్ష్యాన్ని వివరించారు.తన లక్ష్యంపై స్పందించిన మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి రాష్ట్రంలోని ప్రజలందరూ తిరిగి మరల జగన్ మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకొనుటకు కంకణబద్ధులై ఉన్నారని తెలిపారు.వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో చేసిన సంక్షేమం అభివృద్ధి నేటి ప్రభుత్వ హయాంలో లేదని పేర్కొన్నారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి పై అతను చూపిస్తున్న ప్రేమ వెల కట్టలేనిదని తెలిపారు. అడవి కొట్టు రాజులు పూలమాలతో ఘనంగా సన్మానించారు.మార్కాపురం నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మైనార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ గౌస్ మోహిద్దీన్,పంబీ వెంకటరెడ్డి నల్లబోతుల కొండయ్య, బాజి,సాంబా తదితరులు పాల్గొన్నారు.

# గుడ్ ఫ్రైడే సందర్భంగా మజ్జిగ పంపిణీ




**మార్కాపురం, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 3**

గుడ్ ఫ్రైడే పర్వదినాన్ని పురస్కరించుకొని మార్కాపురం పట్టణంలోని కాలేజీ రోడ్డు లో మున్నంగి ఆశీర్వాదం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ సుబ్బారావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఎండ తీవ్రత దృష్ట్యా శుభ శుక్రవారం సందర్భంగా సేవా కార్యక్రమంలో భాగంగా క్రైస్తవ యువత ఈ కార్యక్రమంలో పాల్గొని పట్టణ ప్రజలకు మజ్జిగ పంపిణీ చేపట్టారు. గుడ్ ఫ్రైడే పురస్కరించుకొని మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమని సిఐ సుబ్బారావు అభినందించారు.ఈ కార్యక్రమంలో మున్నంగి రాజు, వేసపోగు రాజు,వరప్రసాద్,విజయ్, క్రైస్తవ సహోదరి, సహోదరులు, పాల్గొన్నారు.

## ప్రపంచమునకు శాంతి సందేశం



**మార్కాపురం, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 3**

గుడ్ ఫ్రైడే సందర్భంగా స్థానిక పులుసుబ్బయ్య కాలనీ కల్వరి ఫెలోషిప్ చర్చి లో ఎంతో భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. యేసుక్రీస్తు సిలువలో చేసిన ప్రాణ త్యాగం సర్వ మానవాలికి అందించిన ప్రేమ సందేశమని తెలిపారు. కరుణ, దయ, క్షమాపణ, గుణములకు ప్రతీకలని, యేసుక్రీస్తు చూపిన ప్రేమ ప్రపంచ శాంతికి సూత్రమని తెలియజేసారు. క్షమాపణ, కరుణ వంటి గుణాలను అందరూ అలవరచుకొని ప్రపంచం శాంతికి కృషి చేయాలని పాస్టర్ ఆదాము గుడ్ ఫ్రైడే సందేశమిచ్చారు.

## అమరావతికి చట్టబద్ధత పట్ల హర్షం

**కంభం, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 3**

రాష్ట్ర రాజధాని అమరావతికి చట్టబద్ధత కలిగినందుకు కంభం ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ ఇబ్రహీం హర్షం వ్యక్తం చేశారు . ఈ సందర్భంగా ఇబ్రహీం మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కార్యదీక్షపరుడిగా అభివర్ణించారు. అమరావతిని రాజధానిగా చట్టబద్ధత కలిగించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్,కు అభినందనలు తెలియజేశారు.



# బైకర్ కోసం రోజుకి 32 కి.మీ.. శర్వా డెడికేషన్ కు హ్యాట్సాఫ్!




జిన్నీ వెడ్స్ సన్నీ 2ని ప్రమోట్ చేస్తున్నప్పుడు మేధా శంకర్ గ్రీన్ లెహంగాలో స్టన్స్ చేసింది

బైకర్ కోసం శర్వానంద్ చేసిన ట్రాన్స్‌ఫర్మేషన్ ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఫస్ట్ లుక్ విడుదలైనప్పటి నుంచే ఆయన లుక్ ప్రేక్షకులను ఆశ్చర్యానికి గురిచేసింది. అయితే, తాజాగా విడుదలైన ట్రాన్స్‌ఫర్మేషన్ వీడియో ఈ మార్పు వెనుక ఉన్న కఠినమైన ప్రయాణాన్ని స్పష్టంగా అందరికీ తెలిసేలా చేసింది. ఈ సినిమాలో బైకర్ పాత్రను




స్టైలిష్ కో-ఆర్డ్ ఫోటోషూట్‌లో కావ్య థాపర్ గ్లామర్‌ను ప్రసరిస్తుంది

రియలిస్టిక్‌గా చూపించాలన్న లక్ష్యంతో శర్వా పూర్తిగా తన శరీరాన్ని మలచుకున్నారు. ట్రైనింగ్ లో భాగంగా శర్వా రోజుకు 32 కిలోమీటర్లు పరుగెత్తడం లాంటి ఎక్స్‌ట్రీమ్ కార్డియో వర్కౌట్స్ చేయడమనేది మామూలు విషయం కాదు. క్రమశిక్షణతో చేసిన ఈ ప్రయాణంలో ఆయన 6 నుంచి 8 కిలోల వరకు బరువు తగ్గి, లీన్ మరియు యూత్‌ఫుల్ ఫిజిక్‌ను సాధించారు. ఈ ట్రాన్స్‌ఫర్మేషన్ కేవలం లుక్ కోసమే కాకుండా, పాత్రకు న్యాయం చేయాలనే పట్టుదలతో జరిగిందిగా కనిపిస్తోంది.



అయితే, ఈ మార్పు వెనుక ఉన్న అసలు కారణం డెడికేషన్‌దే. కఠినమైన వర్కౌట్స్, నిరంతర శ్రమ, మానసిక ఒత్తిడి.. వీటన్నింటినీ ఎదుర్కొంటూ శర్వా తన టార్గెట్ ను సాధించారు. ఈ ప్రయాణాన్ని ఆయన స్వయంగా ఎగ్జాస్టింగ్, పెయిన్‌ఫుల్, రిలెంట్‌లెస్ గా అభివర్ణించడం, ఈ ప్రిపరేషన్ ఎంత తీవ్రంగా సాగిందో చెబుతోంది. ఫిజికల్‌గా మాత్రమే కాదు, మెంటల్‌గా కూడా ఈ ట్రాన్స్‌ఫర్మేషన్ ఒక పెద్ద ఛాలెంజ్‌గా నిలిచింది.ఫిట్‌నెస్ పరంగా చూస్తే, ఆయన రొటీన్ చాలా కఠినంగా ఉంది. జిమ్‌లో స్ట్రెంగ్త్ ట్రైనింగ్, వెయిట్ లిఫ్టింగ్‌తో పాటూ స్ట్రెచింగ్, బ్రీత్‌వర్క్‌లను కూడా పాటించారు. ముఖ్యంగా యోగా ఆయనకు మానసిక ప్రశాంతత ఇచ్చిన కీలక అంశంగా మారింది. కఠినమైన ట్రైనింగ్ వల్ల వచ్చే మెంటల్ స్ట్రెయిన్‌ను తగ్గించడంలో యోగా ముఖ్య పాత్ర పోషించిందని ఆయన చెప్పడం, ఫిట్‌నెస్‌లో మైండ్- బాడీ బ్యాలెన్స్ ఎంత ముఖ్యమో తెలియజేస్తుంది.బిహైండ్ ది సీన్స్ యాంగిల్ లో చూస్తే, ఈ ప్రాజెక్ట్ కోసం చేసిన ప్రిపరేషన్ మరింత ఆసక్తికరంగా ఉంటుంది. ట్రాన్స్‌ఫర్మేషన్ వీడియోలో కనిపించిన ట్రైనింగ్ సెషన్స్, బైక్ రైడింగ్ ప్రాక్టీస్ ఇవన్నీ చూస్తుంటే శర్వా ఈ సినిమా కోసం ఎంత కష్టపడ్డారనేది తెలుస్తోంది. సినిమాలో ఉపయోగించే బైక్స్‌ను నడిపేందుకు స్పెషల్ గా ట్రైనింగ్ తీసుకోవడం ద్వారా, ఆయన పాత్రను మరింత సహజంగా తీర్చిదిద్దారు.ఇది కేవలం ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్ మాత్రమే కాకుండా ఒక యాక్టర్ కమిట్‌మెంట్ కు ఎగ్జాంపుల్ గా నిలుస్తోంది. పట్టుదల, క్రమశిక్షణ ఉంటే అసాధ్యం అనేది ఏదీ లేదని శర్వా చూపించారు. కాగా బైకర్ సినిమా ఏప్రిల్ 3న విడుదల కానుండగా, ఇప్పటికే ఈ మూవీపై మంచి బజ్ నెలకొంది. మరి శర్వా ఈ సినిమా కోసం పడ్డ కష్టం ఏ మేరకు ఫలిస్తుందనేది చూడాలి.

## రెండుసార్లు ఓడినంత మాత్రాన ప్రపంచమేమీ అంతం కాదు



ఐపీఎల్ 2026లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో ఘోర ఓటమి తర్వాత, కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) కెప్టెన్ అజింక్య రహానే జట్టు సభ్యులలో స్ఫూర్తి నింపే ప్రయత్నం చేశాడు. వరుసగా రెండు మ్యాచ్‌లు ఓడిపోయినంత మాత్రాన ప్రపంచం ఏమీ అంతం కాదని, సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని ఆటగాళ్లకు ధైర్యం చెప్పాడు. గురువారం ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన మ్యాచ్‌లో కేకేఆర్ 65 పరుగుల భారీ తేడాతో ఓటమి పాలైంది. మ్యాచ్ అనంతరం డ్రెస్సింగ్ రూమ్‌లో ఆటగాళ్లను ఉద్దేశించి రహానే మాట్లాడాడు. ఈ గేమ్‌లో ఎన్నో సానుకూల అంశాలు ఉన్నాయని, ముఖ్యంగా పది ఓవర్ల తర్వాత బౌలర్లు అద్భుతంగా పుంజుకుని సన్‌రైజర్స్ బ్యాటర్లను కట్టడి చేసిన తీరు అద్భుతమని ప్రశంసించాడు. కేకేఆర్ తన అధికారిక ఎక్స్ ఖాతాలో విడుదల చేసిన వీడియోలో రహానే ఈ వ్యాఖ్యలు చేశాడు. "డ్రెస్సింగ్ రూమ్‌లో మనం ప్రతిరోజూ ఏం ఆలోచిస్తామనేదే నాకు ముఖ్యం. మన ఆటగాళ్ల ప్రయత్నం ప్రశంసనీయం. మీలో ప్రతి ఒక్కరూ మ్యాచ్ విన్నర్లే. ఏ పరిస్థితిలోనైనా జట్టును గెలిపించగల సత్తా మీకుంది. ఆ నమ్మకాన్ని కోల్పోవద్దు" అని రహానే పేర్కొన్నాడు. భారీ లక్ష్య ఛేదనలో తొలి బంతి నుంచే బ్యాటర్లు చూపిన పోరాట

పటిమను కూడా కెప్టెన్ మెచ్చుకున్నాడు. "ప్రపంచం మన గురించి ఏమనుకున్నా పట్టించుకోవద్దు. మనపై మనకు నమ్మకం ఉంటే చాలు" అని రహానే స్పష్టం చేశాడు. కాగా, కేకేఆర్ చరిత్రలో ఒక సీజన్‌ను వరుసగా రెండు ఓటములతో ప్రారంభించడం ఇది కేవలం రెండోసారి మాత్రమే. కేకేఆర్ తన తర్వాతి మ్యాచ్‌లను ఏప్రిల్ 6న పంజాబ్ కింగ్స్‌తో, ఏప్రిల్ 9న లక్నో సూపర్ జెయింట్స్‌తో ఆడనుంది.


## సన్‌రైజర్స్ కెప్టెన్సీపై చర్చ.. నాకు కూడా ఇలాగే జరిగిందంటూ ధోనీ విషయాన్ని గుర్తుచేసిన యువీ!

ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి రెగ్యులర్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ అందుబాటులో లేకపోవడంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) జట్టు తాత్కాలిక కెప్టెన్‌గా ఇషాన్ కిషన్‌ను నియమించింది. ఈ నిర్ణయం క్రీడా వర్గాల్లో పెద్ద చర్చకు దారితీసింది. చాలాకాలంగా జట్టుతో కొనసాగుతున్న యువ ఆల్‌రౌండర్ అభిషేక్ శర్మకు నాయకత్వ బాధ్యతలు అప్పగిస్తారని అందరూ భావించినప్పటికీ, ఫ్రాంచైజీ యాజమాన్యం ఇషాన్ వైపు మొగ్గు చూపింది. ఈ నిర్ణయం పట్ల టీమిండియా మాజీ దిగ్గజం యువరాజ్ సింగ్ తన అసంతృప్తిని, నిరాశను బహిరంగంగా వ్యక్తం చేశాడు. అభిషేక్ శర్మకు కొన్నేళ్లుగా నెట్స్‌లో శిక్షణ ఇస్తున్న యువరాజ్ సింగ్, అతడిని కెప్టెన్‌గా ఎంపిక చేయకపోవడం సరైంది కాదన్నాడు. స్పోర్ట్స్ తక్‌తో యువీ మాట్లాడుతూ... "ఈ నిర్ణయం నన్ను కాస్త నిరాశపరిచింది. ఇషాన్ కిషన్ ఎదుగుదల అంటే నాకూ ఇష్టమే. కానీ, ఒక ఆటగాడి కోణంలో ఆలోచించండి. అభిషేక్ శర్మ ఏడేళ్లుగా ఒకే ఫ్రాంచైజీకి తన సర్వస్వాన్ని అందిస్తున్నాడు. తన రాష్ట్ర జట్టుకు కెప్టెన్‌గా ఉంటూ, ఆ జట్టును గెలిపించాడు. అలాంటి ఆటగాడికి నాయకత్వ బాధ్యతలు ఇవ్వకపోతే, అతను ఎలాంటి మానసిక స్థితితో ఆడతాడు?" అని యువరాజ్ ప్రశ్నించాడు. అయితే, ఇషాన్, అభిషేక్ మధ్య మంచి స్నేహం ఉండటం ఈ ఎదురుదెబ్బ నుంచి కోలుకోవడానికి సహాయపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశాడు.



ఈ సందర్భంగా యువరాజ్ తన కెరీర్‌లోని ఒక సంఘటనను గుర్తుచేసుకున్నారు. "2007లో భారత జట్టులో నేను వైస్-కెప్టెన్‌గా ఉన్నాను. సెహ్వాగ్, హర్భజన్ సింగ్ వంటి సీనియర్లు ఉన్నారు. కానీ, ఎక్కడి నుంచో వచ్చి ఎంఎస్ ధోనీ కెప్టెన్ అయ్యాడు. దానికి కారణాలు ఏవైనా కావచ్చు. కొందరి తలరాతలో నాయకుడిగా ఎదగాలని రాసిపెట్టి ఉంటుంది. కానీ, ఏళ్ల తరబడి జట్టు కోసం కష్టపడిన వారికి అవకాశం రానప్పుడు ఆటగాడిగా నిరాశ కలగడం సహజం" అని వివరించాడు. ఫ్రాంచైజీ నిర్ణయంతో తాను ఏకీభవించలేనని, అయితే ఇప్పుడు నిర్ణయం జరిగిపోయిందని యువరాజ్ అన్నాడు. 'రేపు హైదరాబాద్ గెలిస్తే నా మాటలు తప్పని నిరూపితం కావచ్చు. కానీ, నా అభిప్రాయం ప్రకారం వారి బౌలింగ్ చాలా బలహీనంగా ఉంది. నాయకుడిగా ఎదిగేందుకు ఐపీఎల్ గొప్ప వేదిక. అభిషేక్‌కు ఆ అవకాశం ఇచ్చి ఉండాల్సింది. ఏదేమైనా ఈ నిరాశను పక్కనపెట్టి, కెప్టెన్‌కు మద్దతు ఇస్తూ, జరిగిన అవమానాన్ని స్ఫూర్తిగా తీసుకుని మరింత కష్టపడి ఆడాలని అభిషేక్‌కు చెప్పాను" అని యువీ చెప్పుకొచ్చాడు.

## పంజాబ్, చెన్నై హెడ్ టూ హెడ్ రికార్డులు: లాస్ట్ 7 మ్యాచుల్లో అయ్యర్ సేనదే హవా



ఐపీఎల్ 19లో భాగంగా శుక్రవారం (ఏప్రిల్ 3) చెన్నై సూపర్ కింగ్స్, పంజాబ్ కింగ్స్ తలపడనున్నాయి. చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియం వేదికగా ఈ ఆసక్తికర పోరు జరగనుంది. టోర్నీని ఓటమితో ఆరంభించిన చెన్నై సూపర్ కింగ్స్ సొంత గడ్డపై విజయంతో బోణీ కొట్టాలని ఉవ్విళ్లూరుతోంది. మరోవైపు గుజరాత్?పై ఆల్ రౌండ్ షోతో అదరగొట్టిన పంజాబ్ ఘనంగా టోర్నీని ఆరంభించింది. ఇవాళ్టి మ్యాచులో గెలుపు కోసం ఇరు జట్లు ఉత్సుకతతో ఉన్నాయి. ఇదిలా ఉంటే ఐపీఎల్?లో పంజాబ్, చెన్నై ఇప్పటి వరకు ఎన్నిసార్లు తలపడ్డాయి.. టోర్నీలో ఎవరిది పైచేయి అనే విషయం తెలుసుకుందాం.

**పంజాబ్, చెన్నై హెడ్ టూ హెడ్ రికార్డులు:**

క్యాచ్ రిచ్ లీగ్‌లో చెన్నై సూపర్ కింగ్స్, పంజాబ్ కింగ్స్ ఇప్పటి వరకు 32 సార్లు తలపడ్డాయి. ఇందులో చెన్నై, పంజాబ్ చెరో 16 మ్యాచుల్లో విజయం సాధించి సమఉజ్జీవులుగా ఉన్నాయి.

అయితే, చివరి 7 మ్యాచులను పరిశీలిస్తే మాత్రం పూర్తిగా పంజాబ్?దే ఆధిపత్యం. చివరి ఏడు మ్యాచుల్లో పంజాబ్ ఆరుసార్లు గెలవగా.. చెన్నై ఒక మ్యాచులో మాత్రమే విజయం సాధించింది. టోర్నీలో అత్యధిక టైటిల్స్ గెలిచిన చెన్నైను ఈ చెత్త రికార్డ్ కలవరపాటుకు గురి చేస్తోంది. మరోవైపు చెన్నైపై ఇవాళ్టి మ్యాచులో కూడా విజయం సాధించి తమ హవా కొనసాగించాలని పంజాబ్ భావిస్తోంది.

**ఎంఏ చిదంబరం స్టేడియం పిచ్ రిపోర్ట్:**

ఎంఏ చిదంబరం స్టేడియం సాధారణంగా బ్యాటింగ్?కు అనుకూలం. ఈ పిచ్?లో యావరేజ్ స్కోర్ 173. బ్యాటర్లు క్రీజులో నిలదొక్కుకుంటే 200 నుంచి 230 పరుగులు చేయడం పెద్ద కష్టమేమీ కాదు. దీన్నిబట్టి చూస్తే ఈ పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలమనే విషయం స్పష్టంగా అర్థం అవుతుంది. దీంతో ఈ గేమ్‌లో భారీగా పరుగుల వరద పారే ఛాన్స్ ఉంది. ఇక మ్యాచ్ సాగుతున్న కొద్దీ మంచు (ఐవ్మ) ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున టాస్ గెలిచిన టీమ్ ముందుగా ఫీల్డింగ్ ఎంచుకునే అవకాశం ఉంటుంది.

Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776